


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 24-08-2019 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 42 సంచిక : 300 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఫ్రాన్స్ - భారత్ సంబంధాలకు

# పరస్పర సహకారం

- ఈజ్ ఆఫ్ లివింగ్‌లోనూ భారత్‌కు ప్రత్యేకస్థానం
- ప్రవాసులను ఉద్దేశించి యునెస్కోలో ప్రధాని ప్రసంగం



పారిస్: భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ఈనాటివి కాదని.. కష్టనష్టాల్లో ఈ రెండు దేశాలూ పరస్పరం సహకరించుకుంటాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. నాలుగేళ్ల క్రితం తాను ఫ్రాన్స్ వచ్చినపుడు వేలాదిమంది భారతీయులు తనను అభినందించారని గుర్తు చేసుకున్నారు. ఫ్రాన్స్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. నవభారత్ నిర్మాణం కోసం తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని చెప్పారు. గత ఐదేళ్లలో దేశంలో ఎన్నో సానుకూల మార్పులు వచ్చాయని.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి గర్వకారణమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగే కాదు.. ఈజ్ ఆఫ్ లివింగ్‌లోనూ భారత్‌కు ప్రత్యేక స్థానముందని చెప్పారు. అభివృద్ధి పథంలో భారత్ వేగంగా దూసుకెళ్తోందన్నారు. సేవ చేసేందుకు దేశ ప్రజలు తమకు మరోసారి అవకాశమిచ్చారని చెప్పారు. దేశంలో అవినీతికి తావు లేకుండా పాలన సాగిస్తున్నామన్నారు.

సులభతర వాణిజ్యం, జీవన విధానం అమలుకు కృషి చేస్తున్నామని మోదీ చెప్పారు. 2030 నాటికి టీబీ నిర్మూలన ప్రపంచ లక్ష్యంగా ఉందని.. 2025 నాటికే ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు భారత్ కృషి చేస్తోందన్నారు. దేశం క్రమంగా పేదరికం నుంచి బయటపడుతోందని చెప్పారు. భారత్ అంకుర సంస్థల రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేశాం. నీటి సంబంధ సమస్యల పరిష్కారంపై ఆ మంత్రిత్వ శాఖ పనిచేస్తోంది. పేదలు, చిరు వ్యాపారులు, రైతులకు పింఛనుపై నిర్ణయం తీసుకున్నాం అని ప్రధాని వివరించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



## సంపద సృష్టించేవాళ్లని ప్రోత్సహిస్తాం



**జీఎస్టీని సులభతరం చేస్తాం -- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్**

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమందగమనం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సంపద సృష్టించేవాళ్లను ప్రోత్సహిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె దిల్లీలోని మీడియా సమావేశంలో మాట్లాడారు. సంస్కరణలు అనేవి నిరంతరం జరుగుతాయని.. 2014 నుంచి సంస్కరణలు అజెండాగా పనిచేస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో వాణిజ్య సంస్కరణల్ని తీసుకొచ్చామని వెల్లడించారు. పన్ను విధానాల్లోనూ సంస్కరణలు

తరువాయి 2లో..

## ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు ఏపీ అండ

**అమెరికాలో సీఎం జగన్‌కు తెలుగు ప్రజల జేజేలు**

**ముగిసిన సీఎం వైఎస్ జగన్ అమెరికా పర్యటన**



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమెరికా పర్యటన ముగిసింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 7 గంటలకు ముఖ్యమంత్రి చికాగో నుంచి హైదరాబాద్ బయలుదేరారు. నేటి ఉదయం హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నెల 15న అమెరికా బయలుదేరిన ఆయన వారం రోజుల పాటు అక్కడ పర్యటించారు.

కాగా, సీఎం వైఎస్ జగన్ అమెరికా పర్యటనకు అద్భుతమైన స్పందన లభించింది. ఆయన ఎక్కడకు వెళ్లినా తెలుగు ప్రజలు జేజేలు పలికారు. ముఖ్యంగా డాలస్‌లోని

తరువాయి 2లో..

## 8 గంటల్లో అల్పపీడనం

విశాఖపట్నం: రానున్న 48 గంటల్లో ఒడిశాను ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ కారణంగా శ్రీకాకుళం జిల్లాలో వర్షాలు కురవవచ్చునని అంచనా వేసింది. ఈశాన్య మధ్యప్రదేశ్, దానిని అనుకుని వున్న దక్షిణ ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. అదేవిధంగా పశ్చిమ మధ్య బంగాళా ఖాతం దానిని ఆనుకుని వున్న పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

## కంప్యూటర్ల చోరీతో

# సరికొత్త డ్రామా

- కోడెల శిక్ష అనుభవించాల్సిందే
- ఎమ్మెల్యే అంబటి రాంబాబు



తాడేపల్లి: మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు ఆరోపణలను ఎమ్మెల్యే అంబటి రాంబాబు తీవ్రంగా ఖండించారు. తానేదో కుట్ర చేసినట్లు అవాస్తవాలు మాట్లాడటం సరికాదని, కోడెలే పెద్ద గజదొంగ అని ఆయన విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం అంబటి రాంబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. కోడెల ఇంట్లో దొంగతనం జరిగితే తానే చేయించానని దుష్ప్రచారం జరుగుతుందని... పెద్ద దొంగతనం కప్పిపుచ్చుకునేందుకు చిన్న దొంగతనం డ్రామాను తెరపైకి తెచ్చారన్నారు. కోడెల చెబుతున్న అర్జున్ అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆరా తీస్తే అతడు మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా తేలిందన్నారు. చోరీ చేసిన సొత్తును తిరిగి ఇచ్చినంత మాత్రాన నేరం కాకుండా పోదని, కోడెల శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

ఈ ఘటనపై విచారణ జరుగుతుందని, త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. ఎవరు దొంగలో తేలిపోతారని హెచ్చరించారు. కోడెల శివప్రసాద్ దొరికిపోయిన దొంగ అన్నారు. తాను చిత్తశుద్ధితో ఉన్నానని, దొంగతనాలు చేయించడానికి సిద్ధంగా లేనని పేర్కొన్నారు. కోడెలకు

తరువాయి 2లో..

## ఫోక్స్ వ్యాగన్ కేసులో మంత్రి బొత్సకు సమన్లు

**సెప్టెంబర్ 12న కోర్టుకు హాజరు కావాల్సి ఉంది**



హైదరాబాద్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన ఫోక్స్ వ్యాగన్ కేసు వ్యవహారంలో ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణకు సమన్లు జారీ అయ్యాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టు బొత్సకు సమన్లు జారీ చేసింది. వచ్చే నెల 12న హాజరు కావాలని బొత్సకు న్యాయస్థానం సూచించింది. వైఎస్ సర్కారులో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న బొత్స.. ఫోక్స్‌వ్యాగన్ కేసులో కీలక సాక్షిగా ఉన్నారు.

విశాఖపట్నంలో జర్మనీకి చెందిన ఫోక్స్‌వ్యాగన్ సంస్థ ఏర్పాటు చేస్తామని పలువురు అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేశారనేది కేసులో ప్రధాన అభియోగం. వశిష్ఠ వాహన్ మాజీ అధికారి హెల్మట్ షుష్టర్, భారత ప్రతినిధి అశోక్‌కుమార్ జైన్, వశిష్ఠ వాహన్ డైరెక్టర్లు జగదీశ్ అలగ్‌రాజా, గాయిత్రీ రాయ్, వీకే చతుర్వేది, జోసఫ్ వీ జార్జ్ దీనిలో నిందితులుగా ఉన్నారు. నాంపల్లి సీబీఐ కోర్టులో 2010లో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ఆధారంగా కేసు విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ వాంగ్మూలం నమోదు కోసం సెప్టెంబర్ 12న హాజరు కావాలని న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

## పోలవరంపై వాస్తవ నివేదిక కోరాం

**కేంద్ర మంత్రి షెకావత్**

దిల్లీ: పోలవరం టెండర్ల రద్దుపై ఏపీ హైకోర్టు స్టే ఇచ్చిందని.. కోర్టు స్టేను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉన్నందున ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్మాణంలో వాస్తవ నివేదిక పంపాలని ప్రాజెక్టు అథారిటీని ఆదేశించినట్లు షెకావత్ చెప్పారు. రెండురోజుల్లో ఆ నివేదిక వస్తుందన్నారు.

## మనీ లాండరింగ్ కేసులో చిదంబరానికి ఉపశమనం



దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరానికి ఇంకా ఊరట లభించలేదు. ఈ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 26వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఇదే వ్యవహారానికి సంబంధించిన ఈడీ కేసులో మాత్రం చిదంబరానికి ముందస్తు బెయిల్ లభించింది.

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ముందస్తు బెయిల్ కోసం చిదంబరం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. ఆయన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించలేదు. దీంతో బుధవారం సాయంత్రం చిదంబరాన్ని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. హైడ్రామా అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. లోతైన దర్యాప్తు కోసం చిదంబరాన్ని ఈ నెల 26 వరకు సీబీఐ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. చిదంబరం ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్నారు. ఆ కస్టడీ సోమవారం పూర్తవనున్నందున అదే రోజున ఆయన అరెస్టు పిటిషన్‌పై విచారణ జరుపుతామని సుప్రీం

తరువాయి 2లో..



# 25 న సంఘ సేవకుడు సురేంద్ర జన్మదిన వేడుకలు

## భారీ ఎత్తున పలు సేవా కార్యక్రమాలు



అనకాపల్లి : ప్రముఖ సంఘసేవకుడు తెలుగుదేశంపార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర జన్మదిన వేడుకలు జయప్రదం చేయాలని, సురేంద్ర మిత్రమండలి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఉదయం నుండి పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా కరపత్ర ఆవిష్కరణ జరిగింది. అనంతరం మిత్రమండలి ప్రతినిధులు మళ్ల సూరిబాబు, ఆడారి కుమారస్వామి తదితరులు మాట్లాడుతూ సురేంద్ర నివాసం వద్ద పేదలకు బట్టల పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ల సంతోష్, దాడి జగన్, పాలిమేర ఆనంద్, పిట్ల రాజు, కర్రి సుబ్రమణ్యం, సబ్బవరపు గణేష్, కాంద్రేగుల మురళీకృష్ణ, వై. శ్రీను, వేగి కృష్ణ, బొడ్డడ అప్పలనాయుడు, గోల్డ్ వాసు, నీలగిరి శ్రీను, వెంకటేష్, బాల, రియాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలలో సి ఐ ఉదయ్‌కుమార్



సింథియా: మల్కాపురం విజ్ఞానమండలి యాదవ సంఘం కమిటీ అధ్యక్షులు వాకాడ వాసు ఆధ్వర్యంలో యాదవవీధిలో అత్యంత వైభవంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకాలు, ప్రత్యేకపూజలను నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన తొలిరోజు పూజా కార్యక్రమంలో మల్కాపురం పోలీస్‌స్టేషన్ హౌస్‌ఆఫీసర్ పి.వి.బి. ఉధయ్ కుమార్ పాల్గొని ప్రత్యేకపూజలను నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదములను స్వీకరించారు. ఈ సంధర్భంగా సి.ఐ.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణభగవానుడు సర్వాంతయామిఅని, యాధవుల కులదైవమని అన్నారు. దుష్ఠశిక్షణ...శిష్టరక్షణకై అవతరించిన మహానుభావుడు శ్రీకృష్ణుడు అని అన్నారు. శ్రీకృష్ణలీలలతో కనువిప్పుకావాలని, ప్రతీ ఒక్కరూ భక్తిచింతన కల్గివుండాలని, తద్వారా మనశ్శాంతి పొందవచ్చునని అన్నారు.

ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది శ్రీకృష జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలలో తొలిరోజు భైటోభజన, రెండోరోజు సాంస్కృతి కార్యక్రమాలు, మూడవ రోజు ఆదివారం అనుపు కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. అనుపురోజున స్వామి వారిని పురవీధు లలో ఊరేగించిన అనంతరం స్వామివారిని నిమజ్జన కార్యక్రమాన్ని చేయను న్నట్లు తెలిపారు. అనుపు మహోత్స వంరోజున నేలవే షాలు, సాముగరిడి, సేవగరిడీ, చిడతలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిం చడం జరుగు తుందని తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గౌరవ అధ్యక్షుడు నూనెల శ్రీను(ఆర్మీశ్రీను) ప్రధానకార్యదర్శి నూనెల కృష్ణ, సభ్యులు ఉరుకూటి అచ్చుతరావు, ఉరుకూటి పెంటారావు, వాకాడ నూకరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంపై వారికి చిత్తశుద్ధి లేదు: రామకృష్ణ

విజయవాడ: పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఐ రాష్ట్రప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. ఏపీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఐదేళ్లు పాడుతుందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం టెండర్లు ఎందుకు రద్దు చేశారో తెలియడం లేదని, ఏకపక్షంగా నవయుగ ఇంజినీరింగ్ సంస్థ టెండర్లను రద్దు చేసేశారని ఆయన మండిపడ్డారు. అమరావతి విషయంలో ప్రభుత్వం గందరగోళంలో ఉందని అన్నారు.

అమరావతిపై సాక్షాత్తూ మంత్రే దుష్ప్రచారం ప్రారంభించారని చెప్పారు.

# ఘనంగా "ఆంధ్రకేసరి" జయంతి వేడుకలు



గాజువాక: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 148వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖాగ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, న్యాయవాది, జి.కాశీవిశ్వనాధరాజు పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవానికి, నీతి నిజాయితీలకు టంగుటూరి ప్రకాశం పంతులు ప్రతీకఅని కొనియాడారు. టంగుటూరిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, నిస్వార్ధనాయకులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్.భాగ్యలక్ష్మి, ప్రముఖకవి సత్తిరాజు, రచయిత బి.సత్యానందం, గ్రంధాలయాధికారి అజయ్‌కుమార్, ఎస్.చిట్టిబాబు, శంకరనారాయణ, సాయికుమార్, పుష్పలత, తులసికుమారి, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# 37వ వార్డులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



విశాఖపట్నం : 37 వ వార్డు బర్మకాంప్, శ్రీనివాసనగర్ లో శ్రీ జై కృష్ణ యాదవ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి ఈ వేడుకల్లో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మరియు నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ 37 వార్డు అధ్యక్షులు బొడ్డేటి నాగు, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు,సంఘం సభ్యులు 37 వార్డు నాయకులు,తదితరులు పాల్గొన్నారు

# "టంగుటూరికి" ఘనమైన నివాళి



విశాఖపట్నం, :- ఆంధ్రరాష్ట్ర ప్రధమ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జివియంసి కమిషనర్ డా.జి.సృజన ఘణంగా నివాళి అర్పించారు. వై.యస్.ఆర్ పార్కు వద్ద ఆంధ్రకేసరి విగ్రహానికి శుక్రవారం కమిషనర్, అదనపు కమిషనర్లు ఏ.వి.రమణి, సోమన్నారాయణ, చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు, జె.డి సత్యనారాయణ, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, పి.డి యుసిడి డా.శ్రీనివాసరావు, కన్సల్టెంట్ జివివియస్ మూర్తి అందరు అధికారులు పూలదండలు, పూలతో ఘణంగా నివాళులర్పించారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు ఏపీ అండ

హచిన్సన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ప్రవాసాంధ్రుల సమావేశం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని, అందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రవాసాంధ్రులకు ఆయన భరోసా ఇచ్చారు.

# సంపద సృష్టించేవాళ్లని ప్రోత్సహిస్తాం

తెచ్చామని గుర్తు చేశారు. మిగతా దేశాలతో పోలిస్తే మన దేశ పరిస్థితి మెరుగ్గానే ఉందని వ్యాఖ్యానించారు. భారత్ త్వరితంగా వృద్ధి రేటు నమోదు చేస్తోందన్నారు.

25న జీఎస్టీ అధికారులతో సమావేశం

25న జీఎస్టీ అధికారులతో సమావేశం కానున్నట్టు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. జీఎస్టీని మరింత సులభతరం చేస్తామన్నారు. భద్రతను బలోపేతం చేసే విధానాలు దసరా నుంచి ప్రారంభమవుతాయన్నారు. పన్నుల వసూళ్లలో ఎవరికీ ఇబ్బందులు ఉండవని చెప్పారు. వాణిజ్య యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపైనా ఉందని చెప్పారు.

# కంప్యూటర్ల చోరీతో సరికొత్త డ్రామా

సంబంధించిన హీరో హోండా షోరూమ్‌ను ఆ కంపెనీ సీజ్ చేసిందని, అక్కడ అసెంబ్లీ ఫర్నీచర్ ఉందని అధికారులు గుర్తించినట్లు తెలిపారు. షోరూమ్ తన క్యాంపు ఆఫీస్ అని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.

ఫర్నిచర్ దొంగతనం చేసి కోడెల కార్యాలయంలో దాచుకున్నారని, అసెంబ్లీకి సంబంధించిన 30 కంప్యూటర్లు కోడెల శివప్రసాదరావు కొడుకు, కూతురు కలిసి అమ్ముకున్నారన్న ప్రచారం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై స్కిల్ డెవలప్‌మెంట్ అధికారికి ఈ నెల 9వ తేదీన ఫిర్యాదు చేశానని చెప్పారు. దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని లేఖ రాసినట్లు చెప్పారు. దొంగతనం కోడెల ప్రమేయంతోనే జరిగిందన్నారు. తానేదో కుట్ర చేసి దొంగతనం చేయించినట్లు దుష్ప్రచారం జరుగుతుందన్నారు. ఇది ఒక కంప్యూటర్ కొత్త కుంభకోణమని అభివర్ణించారు.

కోడెల సరికొత్త డ్రామా...

కాగా సత్తెనపల్లిలోని కోడెల శివప్రసాదరావు నివాసంలో కంప్యూటర్ల చోరీతో డ్రామా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కోడెల ఇంట్లో చోరికి గురైనట్టుగా చెబుతున్న కంప్యూటర్లు ప్రభుత్వానివి. విద్యార్థుల శిక్షణకు ఉపయోగించాల్సిన వీటిని సత్తెనపల్లి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నుంచి గతంలో తన ఇంటికి తెప్పించుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నుంచి కంప్యూటర్లు మాయమైన విషయాన్ని ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసుల విచారణ వేగవంతం కావడంతో చోరీ నాటకానికి కోడెల తెర తీశారు.

శుక్రవారం ఉదయం స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది కోడెల నివాసం నుంచి కంప్యూటర్లను తీసుకెళ్లారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి... ఎమ్మెల్యే అంబటి రాంబాబు దగ్గరికి వెళ్లి పోయిన కంప్యూటర్లు దొరికాయని చెప్పగా.... నేను పోలీసులకు ఫిర్యాదు చేస్తే మీరెందుకు కంపూటర్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తును రికవరీ చేయాల్సింది పోలీసులు కదా అని అంబటి ప్రశ్నించగా సదరు అధికారి జవాబు చెప్పలేకపోయారు. దీంతో ఇదంతా కోడెల శివప్రసాదరావు ఆడించిన నాటకమని పక్కాగా తేలిపోయింది.

# మనీ లాండరింగ్ కేసులో చిదంబరానికి ఉపశమనం

కోర్టు వెల్లడించింది. మరోవైపు ఈడీ దర్యాప్తులో ఉన్న ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో చిదంబరానికి కాస్త ఉపశమనం లభించినట్లయింది. ఈ కేసులో ఈడీ నుంచి రక్షణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు విచారణ జరిపిన న్యాయస్థానం.. చిదంబరానికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆగస్టు 26 వరకు ఈడీ అధికారులు ఆయనను అరెస్టు చేయరాదని స్పష్టం చేసింది. అయితే ఆయన విచారణకు సహకరించాలని సూచించింది. ఈడీ, సీబీఐ రెండు కేసులపై సోమవారం మరోసారి విచారణ జరుపుతామని వెల్లడించింది.

# ఈ సృష్టి అంతా దేవుని మయం

- అందరూ సుఖసంతోషాలతో ఉండాలి
- ప్రతీ మనిషి కృష్ణతత్వంతో మెలగాలి
- ముఖ్య అతిథిగా విచ్చేసిన తాళ్లపాక హరినారాయణాచార్యులు



విశాఖపట్నం: ప్రతి పండుగను ఎంతో అందంగా గడుపుకుంటూ , అందరు సుఖ సంతోషాలతో ఉండాలి అనేదే భారత సంస్కృతి , సాంప్రదాయమని తాళ్ళపాక హరినారాయణా చార్యులు అన్నారు, వీరుమామ వీ టీమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావడం చాలా ఆనందంగా ఉందని, వీరుమామ ఎప్పటినుండో ఆహ్వానించప్పటికీ ఇప్పటికి రావడానికి కారణం ఆ శ్రీనివాసుని లీల అని అన్నారు.

ఈ సృష్టి అంతా దేవుని మయం అని, మంచి పనులు చేసే వారికి అంతా మంచే జరుగుతుందని, ఇదే సృష్టి ధర్మం అని వివరించారు.

అలాగే వీరు మామ ఆధ్వర్యంలో ఆ శ్రీనివాసునికి విశాఖలో సంగీత ఉత్సవం నిర్వహించాల్సిందిగా కోరారు. తప్పకుండా చేస్తానని వీరుమామ తెలిపారు. వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు. లక్ష్మి రెడ్డి నేతృత్వంలో కోలాటాలు, వినుము పద్మవతి, భువన భజన సంకీర్తనలతో కార్యక్రమ ఆద్యంతం ఆహ్లాదభరితంగా జరిగింది. కార్యక్రమంలో వీ టీమ్ చైర్మన్ వీరుమామ, సునీత, ఆచార్య శ్రీనివాసు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణజయంతి ఉత్సవాలు



గాజువాక: పారిశ్రామికప్రాంతం గాజువాక, పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో యాదవ సంఘంలో ఆద్వర్యంలో శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంతవైభవంగా నిర్వహించారు. శుక్రవారం గాజువాక, పెదగంట్యాడ, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, అగనంపూడి, అక్కిరెడ్డిపాలెం, నక్కవానిపాలెం, నడుపూరు, శ్రీహరిపురం, మల్కాపురం, వెంకన్నపాలెం, ప్రకాష్‌నగర్, ఏదురువానిపాలెం, చట్టివానిపాలెం, సీతానగరం, గొల్లజగ్గరాజుపేట తదితర ప్రాంతాలలో ప్రారంభంమైన వేడుకలలో శ్రీకృష్ణభగవానునికి అర్చకుల సమక్షంలో క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అత్యంతభక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఈ సందర్బంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నకృష్ణుని వేషదారణతో చిన్నపిల్లలు పలువురుని ఆకట్టుకున్నారు. అనతంరం నిర్వహించిన ఉట్లుసంబరం అంబరాన్ని తాకింది. ప్రతీ ఏడాది కృష్ణజన్మాష్టమిని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ వేడుకలలో యాదవులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు.

**పెదగంట్యాడ:** మండలంలోని ముసలినాయుడుపాలెంలో వంశీకృష్ణ సేవా సంఘం ఆలయ చైర్మన్ కిల్లాడి ముసలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ వంశీకృష్ణ నవరాత్రుల జయంతి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. మొదటిరోజు శ్రీవంశీకృష్ణ జయంతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా నాయకులు తిప్పలదేవన్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ పల్లా శ్రీనివాసరావులు పాల్గొని ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హిందువుల ఆరాద్యదైవం శ్రీకృష్ణభగవానుడని, ఆయన పుట్టినరోజును శ్రీకృష్ణ జన్మాష్టమిగా భక్తులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని అన్నారు. శ్రీకృష్ణుడు సర్వాంతయామిఅని ఆయనను వేడుకుంటే కష్టాలు తీరుతాయని అన్నారు. ప్రతీ ఏడాదిలాగే శ్రీకృష్ణ నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఈ 9రోజులు స్వామివారికి ప్రత్యేకపూజలు, ఆలంకరణ, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులకు అన్నిరకాల ఏర్పాట్లు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీ రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 9వరోజు స్వామివారిని పురువీదులలో ఊరేగించి, అనుపుమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విధిగాపాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని ఆలయకమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పచ్చదనం, పర్యావరణం పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి

## జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన



విశాఖపట్నం, : విద్యార్థుల్లో పచ్చదనం, పర్యావరణం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. ఆరిలోవలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీడ్‌బాల్స్ తయారీని పరిశీలించారు. సీడ్ బాల్స్‌తో ఖాళీ కొండలు, స్థలాలలో పచ్చదనం పెంచేలా వాటిని వెదజల్లాలని పేర్కొన్నారుఈ గాజువాక పరిసరప్రాంతాలలో మొక్కలు పెంపకం కు దోహదపడాలని హితవు పలికారు. తొలుత సీడ్‌బాల్స్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ తరహా కార్యక్రమాలతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్.పి.సి.ఎల్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులను ఆమె అభినందించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏ.డి.హెచ్ దామోదర్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్ఈజయరాం, గ్రీన్ డెవలప్‌మెంట్ ప్రతినిధి రత్నం, హెచ్.పి.సి.ఎల్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిడుతూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



భీమునిపట్నం: టిడిపి పార్టీ భీమిలి డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిడుతూరి శ్రీనివాసరావు 41వ జన్మదిన వేడుకలు శుక్రవారం టిడిపి పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నాయకులు, కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేసి అందరికి మిఠాయిలు పంచిపెట్టారు. డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు గిడుతూరి శ్రీనివాసరావుకి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ గిడుతూరి శ్రీనివాసరావు పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడిరి. ప్రతీ ఒక్కరిని చిరునవ్వుతో పలకరిస్తూ , ఆపదకోసం ఎవరైనా పార్టీ కార్యాలయంకి వచ్చినా తగిన సహకారం అందిస్తూ అందరికి అందుబాటులో ఉండే మంచి వ్యక్తని గంటా నూకరాజు తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి శ్రీనివాసరావు అని, ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని నూకరాజు తెలియ జేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, దాసరి వెంకటేష్, కొక్కిరి అప్పన్న, కనకల అప్పలనాయుడు, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, గోడి అరుణ, రవ్వ వెంకటరావు, రాజగిరి రమణ, కందుల సుందర్ రావు, వాసుపల్లి వంశీ, ఊళ్ళ దుర్గారావు, కంచెర్ల కామేష్, అప్పికొండ నూకరాజు, దాసరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ నూతన కార్యవర్గం



భీమునిపట్నం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) భీమిలి పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా కన్వీనర్ లొడగల అచ్చిబాబు అధ్యక్షతన తగరపువలస శ్రీకృష్ణ కళాశాలలో గురువారం జరిగింది. కన్వీనర్‌గా సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడుగా బి.నరసింగరావు, ఉపాధ్యక్షులు గా మహేష్ రాజేష్, కార్యదర్శిగా గొడ్డు. రాము మహిళా కన్వీనర్‌గా రమాదేవి కో-కన్వీనర్ దేవి తదితరులు ఎంపికయ్యారు.

## కాలిన సెల్‌ఫోన్ టవర్.. తప్పిన ముప్పు



మద్దిలపాలెం: మద్దిలపాలెంలోని సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెట్రోల్ బంక్ సమీపంలోని సెల్‌ఫోన్ టవర్ కాలి బూడిదయింది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటన జరిగిన సమయంలో వర్షం పడుతుండడం వల్ల మంటలు వ్యాప్తి చెందలేదని స్థానికులు, అగ్నిమాపక అధికారులు తెలిపారు.

# రేషన్ కార్డుదారులకు ఇ.కె.వై.సి. తిప్పలు

భీమునిపట్నం: తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో అత్యవసర సమావేశం జరిగింది. రేషన్ కార్డుదారులకు ఇ.కె.వై.సి. చేయుంచుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టడంతో కార్డుదారులు కోటా డీలర్లు మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పడమైనది. ఎప్పటిలోగా చేయించుకోవాలో చెప్పకుండా, సరైన వసతులు కల్పించకుండా వేలిముద్రలు సరిచేసుకోవాలని నిర్ణయించడంతో ప్రజల నెత్తిన పిడుగు పడ్డట్టు అయిందని గంటా నూకరాజు తెలిపారు. సర్వర్ సమస్య ఒకటైతే ఇ.కె.వై.సి. చేయించుకోవడం కోసం ఆనందపురం, తగరపువలస, మీ సేవ కేంద్రాలకు వెళ్ళవలసి వస్తుంది. విపరీతమైన రద్దీ కారణంగా రోజుకి 10 నుండి 20 కుటుంబాలకు మాత్రమే అవ్వడం వలన చాలామంది ఇబ్బంది పడుతున్నారని కూలీలు పనులు మానుకొని వెళ్లినప్పటికి ఒక్కరోజులో అవుతుందని గ్యారెంటీ లేక ఇంకా ఎన్ని రోజులు తిరగాలని ఆవేదనలో కార్డుదారులు ఉన్నారని. ఇ.కె.వై.సి. చేయించుకోకపోతే రేషన్ కార్డులు తొలగిస్తామని, ఎవరైతే వేలిముద్రలు వేసుకోలేదు వారి పేర్లు రేషన్ కార్డు నుండి తొలగిస్తామని చెప్పడంతో కార్డుదారులు అవాక్కయ్యారు.

సరైన వసతులు ఏర్పాటు చేయకుండా ఇలాంటి నిబంధన పెట్టడమేంటని గంటా నూకరాజు ప్రశ్నించారు. భీమిలి నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లో ఇ.కె.వై.సి. కేంద్రం లేకుండా ఉందని, ప్రభుత్వం అధికారులు స్పందించాలని వెంటనే భీమిలిలో కేంద్రం ఏర్పాటు చేయాలని గంటా నూకరాజు డిమాండ్ చేసారు . వై.ఎస్.ఆర్. పార్టీ నాయకులు ప్రజలు పడుతున్న అవస్థలను గమనించి భీమిలిలో కేంద్రం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని గంటా నూకరాజు సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెంటపల్లి యోగీశ్వరరావు, మారోజు సంజీవకుమార్, గిడుతూరి శ్రీనివాసరావు, కాసరపు ఎల్లాజి, చురకల రమణ, దాసరి వెంకటేష్, కందుల సుందర్ రావు, దాసరి వేణుగోపాల్, అప్పికొండ నూకరాజు, రాజగిరి రమణ తదితరులు పాల్గొ న్నారు.

## పేదవిద్యార్థులకు ఆర్థిక సహాయం



భీమునిపట్నం: స్థానిక ఆదర్శ్ హిందీ ప్రేమి మండలి ద్వారా నిర్వహిస్తున్న ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక హిందీ పరీక్షలకు గాను పేదవిద్యార్థుల సహాయార్థం స్థానికంగా ఉన్న కొంతమంది దాతలు ఆదర్శ్ హిందీ ప్రేమిమండలికి విరాళాలు అందజేశారు. ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేయగా మండలి చైర్మన్ కె.ఎస్. ఆర్.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాతలు రేలంగి పెదబాబు, పులవర్తి రాము, సోదరులు, పెంటపల్లి యోగీశ్వరావు, యరబాల అనిల్ ప్రసాద్ కృష్ణవేణి దంపతులు, మోడి వెంకటేష్ ఇచ్చినటువంటి ప్రత్సాహకాన్ని పిల్లలకు గంటా నూకరాజు అందజేశారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ హిందీ ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలకు ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు రాయాలని ఉన్నప్పటికీ పీజులు కట్టలేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని, కానీ వారందరి కలలను సాకారం చేయుటకు ఆ పిల్లల కళ్ళల్లో ఆనందం నింపుటకు దేవుడు దాతల రూపంలో వచ్చి ఇలాంటి వారిని ఆదుకుంటారని, చాలామంది డబ్బు సంపాదిస్తారని కానీ ఇలాంటి సందర్భంలో ఇలాంటి మంచి పనులకోసం చేసే దానం వల్ల వారి గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఇంతమంచి కార్యక్రమనికి నాంది పలికిన సంస్థ చైర్మన్ కె.ఎస్.ఆర్. కృష్ణారావుని ప్రత్యేకంగా అభనందించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, వాసుపల్లి వంశీ, గొడి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గంటా కార్యాలయం వద్ద అర్ధరాత్రి హై డ్రామా



భీమునిపట్నం: భీమిలిలోని గంటా క్యాంపు కార్యాలయం దగ్గర హై డ్రామా నడిచింది. గత కొన్ని రోజులుగా ఈ కార్యాలయం తాలూకా అనుమతుల మీద వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి భవనం కూల్చివేత జరుగుతుందని వార్తలు రావడంతో తెలుగుదేశం శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. ఇక వార్త వివరాల్లోకి వెళ్తే..

గత జూన్ నెల 24వ తారీఖున జీవియంసి అధికారులు ఈ భవనానికి మొదటి నోటీస్ జారీ చేశారు. ఆ పై వారి దగ్గర నుండి ఎటువంటి సమాధానం లేకపోవడంతో మరలా ఆగస్ట్ 22 సాయంత్రం రెండవ నోటీస్ అందజేశారు. తరువాత 22వ తారీఖు రాత్రి భవనం కూల్చివేయడానికి ఏర్పాట్లు జరిగినట్టుగా వార్తలు రావడంతో గంటా శ్రీనివాసరావు అప్రమత్తమయ్యారు. రాత్రి గంటా ప్రతినిధి కాంప్ కార్యాలయం దగ్గరకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 21వ తారీఖున గంటా శ్రీనివాసరావు కుమార్తె సాయి పూజిత పేరు మీద ఈ కార్యాలయం రిజిస్ట్రేషన్ జరిగిందని, 22వ తారీఖు సాయంత్రం 6 గంటలకి జీవిఎంసి అధికారులు 24 గంటలలో భవనం కూల్చివేస్తామని నోటీస్ ఇచ్చారని ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. 22వ తారీఖు రాత్రి 7 గంటలకు హైకోర్టు నుండి స్టే ఆర్డర్ వచ్చిందని, ఆ ఆర్డర్ కాపీని మీడియాకి విడుదల చేసారు.

హైకోర్ట్ తమకు వారం రోజులు సమయం ఇచ్చిందని, అయినప్పటికీ అధికారులు హడావిడిగా ఈ కూల్చివేత కార్యక్రమం చేపట్టడం అన్యాయమని, కేవలం రాజకీయ కక్షతోనే చేస్తున్నట్టుగా కనపడుతోందని ఆయన అన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సింహాచలం: సింహాద్రిపై కొలువు తీరివున్న వరాహా లక్ష్మీ నారసింహ స్వామి వారిని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి అలయ ఈ ఓ ఎం వేంకటేశ్వర రావు, ఇతర అధికారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలకగా, అర్చక స్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. తొలుత కప్పస్థంభం ఆలింగనం చేసుకోగా స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనాంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అలయ సహాయ కార్యనిర్వాహణాధికారి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదలు అందజేశారు. వీరి వెంట 72వ వార్డు వైసీపీ నాయకులు ఆంజనేయరాజు, కొలుసు ఈశ్వరరావు, గంట్ల కిరణ్ బాబు, కర్రి సత్తిబాబు, దాసరి కనకరాజు, వర్మ నందకిషోర్, మంథా కాళిబాబు, ఇతర వైసీపీ నాయకులు అయన వెంట పాల్గొన్నారు.

## ఉప్పాడ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడుగా గంగాధర్

భీమునిపట్నం: భీమిలి రూరల్ మండలం సొసైటీ అధ్యక్షులు గా చేపలు ఉప్పాడ ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షులుగా వాసుపల్లి గంగాధర్ ఎన్నికయ్యారు గురువారం జరిగిన ఈ ఎన్నికలు జరిగాయని వైసిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి దౌలపల్లి ఏడుకొండలు తెలిపారు. కార్యదర్శి గారు సిహెచ్ గోపాల్ డైరెక్టర్లుగా దౌలపల్లి శ్రీను, మైలపల్లి సత్తిరాజు, తులాడ అప్పారావు, గరికిన శ్రీనులను ఎన్నుకున్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



భీమునిపట్నం : స్థానిక కేంబ్రిడ్జ్ స్కూల్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి పాఠశాల లో విద్యార్థిని విద్యార్థులు కోలాటం, ఉట్టి కొట్టడం, వసు దేవ కృష్ణ కాకతీయ మర్దనం, గోపికల వస్త్రాపహరణ వెన్న చిలుకుట మొదలగు దృశ్యమాలికలు చిన్నారుల నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులను. అబి నందించారు. ఆలాగే సంగివలస అమెయి వరల్డ్ స్కూల్ లో కృష్ణాష్టమి గోకులాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణ, గోపికా వేషధారణతో వచ్చిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీ కృష్ణ లీలలు నృత్యం ఆహుతులను అలరించింది. ఈ కార్యమానికి డైరెక్టర్ శ్రీమతి తులసి మండవ, ప్రిన్సిపాల్ శ్రీమతి అరుణ, రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ బోరా, స్కూల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో అమ్మ అస్సోషియేషన్ వారు అందులతో నిర్వహించిన సంగీత కచేరీ అదనపు ఆకర్షణగా నిలిచింది.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి




సింహాచలం: కృష్ణ జన్మాష్టమిలో భాగముగా 23న హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యములో ఆళ్వార్ దాస్ గ్రౌండ్స్‌నందు 1 లక్ష చదరపు అడుగుల విస్తిరణములో పెండాల్ ఏర్పాటు చేయడం జరిగింది . కృష్ణ చైతన్యాన్ని వ్యాప్తి చేస్తున్న హరే కృష్ణ ఉద్యమము జగత్ ప్రసిద్ధమైన ఇస్కాన్ బెంగళూరు ఆలయము వారి శాఖగా సాగుతున్నది హరే కృష్ణ మూవ్మెంట్ . భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు అందించిన అమృత సందేశాన్ని విశ్వవ్యాప్తి చేయుట మరియు పూజ్యనీయులైన ఏ.సి .భక్తి వేదాంత శ్రీల ప్రభుపాదులు స్థాపించిన కృష్ణ చైతన్య ఉద్యమ లక్ష్యాలను సఫలీకృతం చేయటము దీనిలక్ష్యం . ఆధునిక సంక్షుభిత పరిస్థితులలో ఈ సందేశాలు మానవాళికి చలివేంద్రంలాంటివి. ఈ లక్ష్య సాధన కోసం ఆగష్టు 23 నుంచి 25వ తేదీ వరకు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకులను విశాఖపట్నంలోని ఎం.వీ.పి.కాలనీలో గల ఆళ్వార్‌దాస్ గ్రౌండ్ నందు అత్యంత ఘనముగా నిర్వహించడం జరుగుతుంది .

శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవుల అష్టమ గర్భ సంజాతుడు. అయన చతుర్భుజాలతో శంఖు, చక్రం, గధాయుధములు, పద్మం ధరించి, కౌస్తుభమణితో ప్రకాశిస్తూ, పీతాంబరధారిఐ, వైడూర్య నిర్మితమైన మకుటముతో విరాజిల్లుతూ నీలమేఘశ్యాముడై అవతరించారు.

అభిషేకము, హరినామ జపయజ్ఞము, గోపాలునికి ఊయ్యాల సేవ :- ఈ ఉత్సవంలో భాగముగా బృందావనమ్ నుంచి వచ్చిన లడ్డుగోపాలునికి మృదువైన ఉయ్యాలలో సేవ తదితర కార్యక్రమములు భక్తిపారవశ్యముతో నిర్వహించారు.

# సైమన్ కమీషనుకు గుండెలు చూపిన ధీరుడు

## విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి



విజయనగరం: స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమీషను భారతీయులపై కాల్పులు జరపగా, వారికి ఎదురు నిలిచి తన గుండెలు చూపిన ధీరుడు, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ జయంతి వేడకలకు జిల్లా ఎస్పీ బి. రాజకుమారి హాజరై, కీ.శే.లు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ - చూపి, ఆంధ్ర కేశరిగా కీశేలు టంగుటూరి ప్రకాశం పంతులు గారు కీర్తింపబడ్డారన్నారు. కీ శేలు ప్రకాశం పంతులు గారు స్వాతంత్ర్య సమర యోధునిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా, రాజనీతిజ్ఞునిగా విశేషంగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రకాశం పంతులు గారు అందించిన సేవలుకుగుర్తుగా ఆయన స్వంత జిల్లా ఒంగోలును 1972లో ఆయన పేరుగా 'ప్రకాశం'గా నామకరణం చేసారన్నారు. పేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు గారు, ఎంతో కష్టపడి, ఉన్నత చదువులు చదివి, స్వశక్తితో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డిఎస్పీ సి.ఎం. నాయుడు, ట్రాఫిక్ డిఎస్పీ ఎల్. మోహన రావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సిఐ కె. దుర్గా ప్రసాదరావు, ఆర్ఐలు శ్రీహరి రావు, శంకర్, రమేష్ కుమార్, రామకృష్ణ, మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని కీశేలు ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.

# రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తా



విశాఖపట్నం: రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి మంత్రి ముత్తంశెట్టి శ్రీమివాస్ రావు తెలిపేరు . శుక్రవారం ఎండాడ లో వి ఎం అర్ డి ఏ ద్వారా నిర్మించిన 13.45 కోట్లతో 3.01కి.మీ ల 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ ను , సెంటర్ లైటింగ్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమల్లో 75%, ఉద్యోగాలు స్థానిక యువతకే కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఏ ఒక్క పేదకు ఇల్లు లేదనే మాట వినపడకూడదనే ఉద్దేశ్యం తో యీ ఉగాది నుండే 25లక్షల ఇళ్లను నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 4లక్షల గ్రామ వలంటీర్ల ద్వారా పాలనను ప్రజలకు చేరువు చేస్తున్నామని అన్నారు. దశల వారీగా మద్యపాన నిషేదాన్ని అమలు చేస్తున్నామని , ఐదేళ్లలో సంపూర్ణ మద్య రహిత రాష్ట్రంగా చేస్తామన్నారు .వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీతి రహిత పాలన దిశగా అడుగులు వేస్తున్నారని , తాను చేసే ప్రతి చర్య వెనుక ప్రజా సంక్షేమమే ధ్యేయమని అన్నారు . ప్రతిపక్షం పనిగట్టుకుని దుర్ప్రచారం చేయడం తగదని అన్నారు.

విశాఖ అభివృద్ధి లో వి ఎం ఆర్ డి ఏ కీలకంగా వ్యవ హరిస్తోందని , అందుకు తగ్గట్టుగానే కమీషనర్ కోటేశ్వర రావు ప్రణాళికలు తయారు చేసారని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ, ఎండాడ మాజీ ఖుతీజుఖుఅషష్ట్ర చెన్నాదాస్ , వార్డ్ సభ్యులు , అధికారులు హాజరైనారు.

# విజయభాను సంపాదకీయం

## ఉత్కంఠ రేపుతున్న అరెస్టులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం అరెస్టు ఉదంతం ఉత్కంఠను రేకెత్తించింది. దర్యాప్తు సంస్థలు వెతుకున్నట్టుగా, ఆయన తప్పించుకున్నట్టుగా మీడియాలో ప్రచారం సాగింది. అయితే కేంద్ర మాజీ హోంమంత్రి అయిన చిదంబరం చట్టానికి చిక్కకుండా తప్పించుకుపోతారా అనేది చాలామందికి నమ్మలేని విషయం. రాత్రివేళ చిదంబరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చి పత్రికా సమావేశం ఏర్పాటుచేసి తన వాదన వినిపించడమే కాకుండా న్యాయవాదులతో చర్చలు జరుపడంలో నిమగ్నమై ఉన్నానని వెల్లడించారు. ఆయన తన నివాసానికి వెళ్ళిన తరువాత దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. ముందస్తు బెయిల్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించడంతో, ఆయన సుప్రీంకోర్టు నుంచి ఊరట పొందడానికి రోజంతా ప్రయత్నించారనేది వాస్తవం. సుదీర్ఘ ప్రజా జీవితంలో ఉన్నవారు ఆర్థిక నేరస్థుల మాదిరిగా తప్పించుకు పోవడం సాధారణంగా జరుగదు. రాజకీయ నాయకులు అవసరమైతే జైలుకు వెళ్ళడానికి సిద్ధపడుతరు. ప్రముఖ ప్రతిపక్ష నాయకుడైన చిదంబరంపై కేసులు పెట్టి దర్యాప్తు సాగించడం వివాదాన్ని అనుమానాలను రేకెత్తిస్తున్నది. తాను కానీ, తన కుటుంబసభ్యులు కానీ ఏ కేసులోనూ నిందితులు కాదనీ, ఈడీ లేదా సీబీఐ తమపై చార్జిషీటు, ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదని చిదంబరం అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు చిదంబరం అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, ప్రభుత్వం రాజకీయ వేధింపులకు దిగుతున్నదని ఆరోపిస్తున్నారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుండటం వల్లనే ఆయనను వేధిస్తున్నారనేది కాంగ్రెస్ ఆరోపణ. చిదంబరానికి మద్దతు ఇచ్చి అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. దేశంలో రాజకీయ అవినీతి తీవ్రస్థాయిలో ఉన్నది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం వాటిల్లే రీతిలో ఈ అవినీతి పెరిగిపోవడం ఆందోళనకరం. అయితే ప్రజలకు అవినీతి పట్ల ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతను రాజకీయ ప్రయోజనాల కోసం సొమ్ము చేసుకోవడం మరింత పతనాన్నే సూచిస్తున్నది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, అవినీతిపై పోరాటం సాగడం లేదు. అవినీతిపై పోరాటం పేరుతో రాజకీయ కక్షసాధింపు చర్యలు సాగుతున్నాయి. నాడు కాంగ్రెస్ పార్టీపై ఇవే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న విమర్శ అదే. యూపీఏ రెండవ విడత అనేక అవినీతి ఆరోపణలకు గురైంది. ఈ నేపథ్యంలో అవినీతిని నిర్మూలిస్తామనే ప్రచారంతో మోదీ అధికారానికి వచ్చారు. ఐఎన్ఎక్స్ మీడియా అనే సంస్థకు విదేశీ పెట్టుబడుల పెంపుదల బోర్డు (ఎఫ్ఐపీబీ) 4.62 కోట్ల రూపాయలు మాత్రమే ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు తెచ్చుకోవడానికి 2007 మార్చిలో అనుమతిచ్చింది. కానీ ఈ సంస్థ 305 కోట్ల మేర పెట్టుబడులు తెచ్చుకున్నది. సంబంధిత అనుమతులు లేకుండా ఈ నిధులను మరో సంస్థ ఐఎన్ఎక్స్ న్యూస్‌కు బదిలీ చేసింది. దీనిపై 2008 లోనే దర్యాప్తు మొదలైంది. అయితే మోదీ మొద టి పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు చిదంబరం మెడకు కూడా చుట్టుకున్నది. ఐఎన్ఎక్స్ మీడియా అక్రమాలకు పాల్పడిన కాలంలో చిదంబరం కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నారు. ఐఎన్ఎక్స్ సంస్థ ఈ కేసు నుంచి బయటపడటానికి చిదంబరం కుమారుడికి లబ్ధి చేకూర్చిందని ఆరోపిస్తూ దర్యాప్తు సంస్థలు తం డ్రీకొడుకులపై దర్యాప్తు ప్రారంభించాయి. చిదంబరం మద్దతుదారులు కొందరు వినిపిస్తున్న వాదన ప్రకారం ఆయన మీద బలమైన ఆరోపణలేవీ లేవు. చిదంబరం అరెసు కు దర్యాప్తు సం స్థలు చెబుతున్న కీలక ఆధారం ఒకప్పుడు ఐఎన్ఎక్స్ మీడియా అధినేతగా వెలిగిపోయిన ఇం ద్రాణి ముఖర్జీ సాక్ష్యం! ఆమె జీవితాన్ని, ఆమెపై వచ్చిన ఆరోపణలను పరిశీలిస్తే ఏ మాత్రం విలువలు పాటించినట్టుగా కనిపించదు. తన మొదటి సంబంధం బిడ్డను హత్యచేసి తగుల బెట్టిన కేసులో ఇంద్రాణి ముఖర్జీ నిందితురాలు. ఆమె ఇప్పు డు జైలులోనే ఉన్నారు. విదేశీ మారకం నిర్వహణ కేసులోనూ తీవ్ర ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఆమెను అప్రూవర్ అంటూ చిదంబరానికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పించడం కష్టం కాదనే వాదన ఉన్నది. దేశంలో రాజకీయ అవినీతి తీవ్రస్థాయిలో ఉన్నది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం వాటిల్లే రీతిలో ఈ అవినీతి పెరిగిపోవడం ఆందోళనకరం. అయితే ప్రజలకు అవినీతి పట్ల ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మరింత పతనాన్నే సూచిస్తున్నది. కేం ద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, అవినీతిపై పోరాటం సాగడం లేదు. అవినీతిపై పోరాటం పేరుతో రాజకీయ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## కృష్ణా నదికి వరదలు ప్రభుత్వ వైపరీత్యమే

గుంటూరు: తన ఇల్లు ముంచాలనే ఉద్దేశంతో కృష్ణా నదీపరివాహక ప్రాంతాలన్నీ ముంచారని తెదేపా అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదలు ప్రకృతి వైపరీత్యం వల్ల కాదని.. ప్రభుత్వ వైపరీత్యమే అని ఎద్దేవా చేశారు. తన ఇంటిని ముంచే కుట్రతో ప్రజలను నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద పరిస్థితిని నియంత్రించడానికి అవకాశం ఉన్నప్పటికీ అలా చేయలేదని.. రాజధానిని వరద నీటితో ముంచాలన్న తప్పుడు ఆలోచనతో వైకాపా ప్రభుత్వం ఉందని ఆయన ఆరోపించారు. ఇటీవల సంభవించిన వరద పరిస్థితులపై గుంటూరులోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 19 గ్రామాల్లో పర్యటించానని, వరద పరిస్థితిని సమీక్షించానని చంద్రబాబు చెప్పారు. ఎక్కడ చూసినా హృదయ విదారక పరిస్థితులు కనిపించాయన్నారు. దాదాపు 53 వేల ఎకరాల పంటభూములు నీట మునిగాయని వివరించారు. వరదలపై ఏనాడూ ముఖ్యమంత్రి జగన్ సమీక్ష చేయలేదని చంద్రబాబు ఆరోపించారు. నీటి ప్రవాహం వివరాలన్నీ ప్రభుత్వం, అధికారుల దగ్గర ఉంటాయని చంద్రబాబు అన్నారు. ఏ రిజర్వాయర్‌లో ఎన్ని నీళ్లు ఉన్నాయో చూసుకోకుండా, వాటిని నింపే ప్రయత్నం చేయకుండా దిగువకు వదిలేశారని, అందుకే ప్రకాశం బ్యారేజీ దిగువ లంక గ్రామాలు వరదలో మునిగిపోయాయని వివరించారు. ఆల్మట్టి నుంచి నారాయణ్‌పూర్‌కు నీరు రావాలంటే 12 గంటల సమయం పడుతుందని చంద్రబాబు చెప్పారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పరవాడ : పరవాడమండలము వెన్నెలపాలెం శివారు గొల్లలపాలెం ,బొట్టవానిపాలెం లో శు క్రవారముశ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగాజరిగాయి.ముందుగా స్ధానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ , వైసిపిరాష్టసిఇసిసభ్యులు పైలశ్రీనువాసురావు,మండలపార్టిప్రెసిడెంట్ సిరపురపుఅప్పలనాయుడు, జిల్లాప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడు తథితర్లు దర్శించుకొనిప్రత్యేకపూజలుచేసారు. ఈకార్యక్రమంలో వెన్నెలసన్యాశిరావు, పలఅప్పల నాయుడు, వెన్నెలనర్సింగ్ రావు,వెన్నెల అప్పారావు, నక్కకుమార్ రాజ్ , యలమంచిలి వెంకటరావు, బందం సింహచలం, సర్వసిద్ధి మహలక్ష్మినాయుడు తథితర్లు పోల్గోన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాల నివారణకు ముద్దుర్తిలో స్టెంచెస్ ఏర్పాటు



చోడవరం- ఇసుక అక్రమ తవ్వకాలు నియంత్రించేందుకు చోడవరం పోలీసులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ముద్దుర్తి సంగమేశ్వస్వామి ఆలయం నదీ పరీవాహక ప్రాంతం వద్ద శుక్రవారం ఎక్సుకవేటర్ సహాయంతో స్టెంచెస్ తవ్వించారు. ఎస్.ఐ, ఎస్.ఎ.మునాఫ్‌తో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన యూనివర్సిటీ అరకులో ఏర్పాటు చెయ్యాలి



గిరిజన ప్రాంతం రోడ్డు, రవాణ సౌకర్యం అందు బాట్లో ఉంది.అలాగే అసోసియేట్ అధ్యక్షుడు నోగేలీ.అప్పన్న మాట్లాడుతూ 1/70 చట్టం విఘాతం కలక్కుండా 5 వ, షెడ్యూల్ అనుగుణంగా ఆదివాసీల స్వయం ప్రతిపత్తి గల నూతన జిల్లా అరకు లోయను ఏర్పాటు చెయ్యాలన్నారు.జిల్లా ఉపాద్యక్షులు పాంగి. నందో మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ అరకులోయలో ఏర్పాటు చెయ్యడం వల్ల ఆదివాసీలు అక్షరాస్యులు అవ్వడమే కాకుండ అంతరించిపోతున్న సాంప్రదాయలు అలవాట్లు,కళలు, భాష, కనుమరుగు కాకుండ యూనివర్సిటీలో పరిశోధనల ద్వారా పరిరక్షించ వచ్చన్నారు .తాంగుల.చిట్టిబాబు మాట్లాడుతూ అరకులోయ గిరిజన యూనివర్సిటీ సాదించడం కోసం సంఘ పరంగా తగు కార్యచరణ రూపొందించి విద్యార్థి, ఉద్యోగ, మేధావి, ప్రజా సంఘాలతో కలసి యూనివర్సిటీ సాదించడం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారుడు. ఉల్లి.గంగ రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టి.నారయణ, సుడి.అప్పన్న, కుడేలి.రాంబాబు, బోయి.గోపాల్, కొర్రా.స్వామి, జి.సిద్దేశ్వరరావు, తదితరులు పాల్గోన్నారు.

అరకు : శుక్రవారం అరకులోయ గిరిజన భవనం అఖిల భారత ఉద్యోగుల సంఘం రూరల్ జిల్లా అధ్యక్షుడు ముఖ్య ప్రతినిధులు కోడ.సింహాద్రి మాట్లాడుతూ గౌరవ మఖ్యమంత్రి వర్యులు ఇచ్చిన హామీలు మేరకు అరకు లోయలోనే గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చెయ్యాలని డిమాండు చేశారు.గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కావల్సిన వనరులైన ప్రభుత్వ భూములు అందుబాట్లో ఉన్నాయి.ప్రశాంతమైన ప్రకృతి జలవనరులు పుష్కలంగా ఉన్నాయి.

తొందర్లో రైల్వే డబుల్ లైన్ అందుబాట్లో రానుంది.నిత్యం కరెంట్ కొరత ఉండదు.మాచ్ ఖండ్ సీలేరు జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి.సముద్ర మట్టం 100 కిలోమీటర్ల దూరంలో ఉంది.విమానాశ్రయం నిర్మాణల కొరకు అనువైన ప్రభుత్వ భూములున్నాయి. పార్లమెంట్ శాసనసభ నియోజక వర్గాల ముఖ్యకేంద్రం, రాష్టంలో అధిక జనభా గల

# ఈ సృష్టి అంతా దేవుని మయం

### అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### ప్రతీ మనిషి కృష్ణతత్వంతో మెలగాలి

### ముఖ్య అతిథిగా విచ్చేసిన తాళ్ళపాక హరినారాయణాచార్యులు



విశాఖపట్నంః ప్రతి పండుగను ఎంతో అందంగా గడుపుకుంటూ , అందరు సుఖ సంతోషాలతో ఉండాలి అనేదే భారత సంస్కృతి , సాంప్రదాయమని తాళ్ళపాక హరినారాయణా చార్యులు అన్నారు.

వీరుమామ వీ టీమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావడం చాలా ఆనందంగా ఉందని, వీరుమామ ఎప్పటినుండో ఆహ్వానించప్పటికీ ఇప్పటికి రావడానికి కారణం ఆ శ్రీనివాసుని లీల అని అన్నారు.

ఈ సృష్టి అంతా దేవుని మయం అని, మంచి పనులు చేసే వారికి అంతా మంచే జరుగుతుందని, ఇదే సృష్టి ధర్మం అని వివరించారు.

అలాగే వీరు మామ ఆధ్వర్యంలో ఆ శ్రీనివాసునికి విశాఖలో సంగీత ఉత్సవం నిర్వహించాల్సిందిగా కోరారు. తప్పకుండా చేస్తానని వీరుమామ తెలిపారు. వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు. లక్ష్మి రెడ్డి నేతృత్వంలో కోలాటాలు, వినుము పద్మవతి, భువన భజన సంకీర్తనలతో కార్యక్రమ ఆద్యంతం ఆహ్లాదభరితంగా జరిగింది. కార్యక్రమంలో వీ టీమ్ చైర్మన్ వీరుమామ, సునీత, ఆచార్య శ్రీనివాసు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష సాధింపులేదు

### టీడీపీ పార్టీ శ్రేణుల వ్యాఖ్యలను ఖండించిన మంత్రి అవంతి శ్రీనివాసరావు



భీమునిపట్నం: ప్రభుత్వానికి ఎవరిపైన కక్ష సాధించే అవసరం లేదని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అవంతి శ్రీనివాసరావు, భీమిలి తన క్యాంపు కార్యాల యంలో మీడియా ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి గాని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికి గాని , ఎవరిపైన కక్ష సాధించే ఉదేశ్యం లేదని అన్నారు. గురువారం రాత్రి గంటా శ్రీనివాసరావు భవనానికి మున్సిపాలిటీ వారు అంద జేసిన నోటీసులు గూర్చి ఆ భవనం కూల్చివేసే విషయం పై ఆయన స్పందిస్తూ ప్రభుత్వం అనధికార కట్టడాల విషయంలో ఒక పాలసీతో ముందుకు వెళ్తుందని అంతే గాని ఏదయినా పార్టీ పై గాని వ్యక్తులపై గాని కక్షలు సాధించటం లేదని అన్నారు. అది అనధికార కట్టడమైతే ఆ విషయం జీవీఎంసీ అధికారులు చూసుకొని వారి నియమ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

అంతే గాని ప్రతి విషయంలోను అధికార పార్టీ ని గాని , వారి మంత్రులను , ఎమ్మెల్యే లను గాని విమర్శించి మాట్లాడుట తగదని అన్నారు. భీమిలి జోనల్ కమిషనర్ గోవిందరావు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు పార్టీ కార్యాలయం నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా సి ఆర్ జెడ్ పరిధిలో ఉందని అందుకు గాను జూన్ 21వ తారీఖున ఆ భవనానికి సంబంధించి ఏమైనా అనుమతి పత్రాలు ఉంటే తెలియజేయమని మొదటి సారి నోటీసులు అందజేయడం జరిగిందని ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేని కారణంగా గురువారం 2వ సారి నోటీసులు జారీ చేసి భవనం కూల్చివేతకు 24 గంటల సమయం కేటాయించామని అన్నారు. అయితే కోర్టు ఆదేశాలు మేరకు ఒక వారం గడువు ఇవ్వటం జరిగిందని చెప్పారు.

## వృత్తి ధర్మతోపాటు ప్రతి ఒక్కరూ సమాజసేవ అలవరచుకుని ప్రేరణగా నిలవాలి

### గ్రామ సచివాలయ ఉద్యోగాలకు శిక్షణ ముగింపు కార్యక్రమంలో

### చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి -రామ్ నరేష్ బిర్లంగి

చోడవరం-సమాజంలోని ప్రతి పౌరుడు తమ వృత్తి ధర్మతో పాటు సమాజానికి వీలైనంత సేవను అందిస్తూ, మరింత మందికి ప్రేరణగా నిలవాలని చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి అన్నారు.

పట్టణంలోని ప్రేమ సమాజం నూతన భవణంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ నిరుద్యోగ అభ్యర్థుల శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఫోరమ్‌ఫర్ బెటర్ చోడవరం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్య క్రమం చివరి రోజున అభ్యర్థులకు శిక్షణనిచ్చేం దుకు అసిస్టెంట్ లేబర్ కమీషనర్ రమ్య పాల్గొని కరెంట్ అఫైర్సుపై వివరించారు. అనంతరం శిక్షణా కార్యక్రమంకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పలు ప్రభుత్వ ఉన్నతాధికారులను, ఫ్యాకల్టీలను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆర్క్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు ప్రసాద్ మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారి రామ్ నరేష్ స్ఫూర్తితో ఇప్పటికే ఫోరమ్ ఫర్ బెటర్ చోడవరం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, గ్రామీణ యువతను అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసి వారి ప్రతిభకు తగ్గ ఉద్యోగాలలో స్థిరపడటమే లక్ష్యంగా ఉద్యోగమేళాలు, నిరుద్యోగ యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు అధ్యాపకులు ఎన్.దేముడు,పోస్టల్ కృష్ణ,ప్రేమ సమాజం రాజు, ప్రకాష్‌రావు,వివిధ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ధర్మశ్రీని కలసిన ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు



చోడవరం-గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ నాయకులుగా మూడవ సారి హ్యాట్రిక్ విజయం సాధించిన శరగడం రామునా యుడు బృందం గాజువాకలో నివాస ముంటున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఫ్యాక్టరీ ప్రగతి పథంలో నడిచేలా యూనియన్ నాయకులు, కార్మికులు చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.ఎస్.నాయుడు, అధ్యక్షులు రాయి సూరిబాబు, కనిశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పూర్తి స్థాయి పనులు కల్పించాలి



అనకాపల్లి .. మండలంలో బీఆర్టీ కొలనీ సమీపంలో ఉన్న సివిల్ సప్లై గుడౌన్‌లో పూర్తి స్థాయి పనులు కల్పించాలని, కన్యకాపరమేశ్వరీ లారీ ఓనర్సు అసోషియేషన్ మరియు కళాశీలు విజ్ఞప్తి చేసారు. పట్టణంలో రింగ్‌రోడ్‌లో ఉన్న, మాజీ మంత్రి రాష్ట్ర ప్రదాన కార్యదర్సి దాడి వీరభద్రరావు లారీ ఓనర్లు, కళాశీలు కలిసారు. వారి సమస్యలు వివరించారు. గుడౌన్ వద్ద 25 ఏళ్లుపైగా ఎగుమతులు, దిగుమతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రతీ రోజు మూడువేల టన్నులకు పైగా రవాణా చేసే వారమన్నారు. గత ఏడాది నుంచి 20 శాతం పనులు మాత్రమే కల్పిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. దీనితో ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండువందల మంది కళాశీలు, వందమంది లారీ ఓనర్లు గుడౌన్‌పై ఆదారపడి బ్రతుకుతున్నామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు అధికారులకు వివరించిన పట్టించుకోలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. దీనిపై దాడి వీరభద్రరావు స్పందించి జిల్లా కలెక్టర్, సంబందిత అధికారులకు సమస్యలు తెలిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షులు దాడి జగన్నాధం, కార్యదర్సి నాయుడు, జి. వెంకటరావు, ఎం.నాగేశ్వరరావు, సాలాపు శ్రీనివాసరావు, డి. అప్పారావు, ఎం. అప్పారావు, కె. సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

ASTROLOGY
శ్రీశ్రీ కాణిపాకం స్వామి జ్యోతిష్యా/వాస్తు సమస్యలకు 25 సం॥రాలుగా సరైన పరిష్కారములు సూచిస్తున్నారు. అవసరమైన వారు పర్సనల్ అపాయింట్‌మెంట్ కొరకు ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవలెను.
9393110416

FINANCE
(with A/c Pay)
JK
Govt. Reg. No. 136/2009
96665 47338

## కృష్ణాష్టమి వేడుకలలో ఆకట్టుకున్న గోపిక వేషధారిణి అపర్ణ



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక శ్రీ సత్యసాయి విద్యావిహార్ నందు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.చిన్నారులు రాధా,గోపాల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు.గోపిక వేషధారిని అనిశెట్టి.అపర్ణ అందరినీ తన గోపిక వేషధారనతో ఆకట్టుకుంది.ఈ సందర్భంగా చిన్నారి అపర్ణ ను ఉపాధ్యాయులు,తోటి విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

## శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



సింహాచలం : 72 వ వార్డు పరిధి అడివివరం శాఖా గ్రంథాలయంలో ఆంధ్రా కేసరీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి 147 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమంలో జిల్లా విశ్రాంతి ఆరోగ్యాధికారి బాబు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నీతితో కూడిన రాజకీయాలకు నాంది పలికి అందరకీ ఆదర్శప్రాయుల గా నిలిచారని అన్నారు న్యాయవాది రామక్రిష్ణ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి ఎదురేగి గోబ్యాక్ అంటూ నినదించారు అన్నారు ఈ కార్యక్రమం గ్రంధాలయ అధికారి పి వి యన్ రాజు ఆధ్వర్యంలో జరగగా ఈ కార్యక్రమానికి పాఠకులు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

యలమంచిలి, యలమంచిలి శాఖ గ్రంథాలయంలో తేదీ 2 శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆంధ్ర కేసరి శ్రీ టంగటూరి ప్రకాశం గారి 147వ జయంతి సందర్భంగా ఎస్‌టిఓ కర్రి జోగినాయుడు మరియు రిటైర్డ్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆడారి పూరీజగన్నాధం చేతులు మీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఓ జోగి నాయుడు మాట్లాడుతూ ప్రకాశం తన చదువుకోసం 20 వేల అప్పుచేసిన ప్రకాశం చక్కని గ్రంథాలయం ఏర్పరచుకుని, కొన్ని నెలల్లోనే హైకోర్టు వకీలుగా మంచిపేరుతో పాటు, సంపాదన కూడా సాధించాడు. దినసరి ఆదాయం వందలనుండి వేలకు పెరిగింది. ఆత్మవిశ్వాసం, నిరంతర పరిశ్రమ, నిర్భీకత ఆయనకు పెట్టనికోటలు. మద్రాసునుండి వెలువడుతూ వుండిన లాటైమ్స్ పత్రికలో వ్యాసం వ్రాస్తూ, న్యాయమూర్తి బౌద్ధికంగా అవినీతిపరుడు అని విమర్శించాడు. పదునాలుగేళ్ల బారిస్టర్‌గా వుండి దాదాపు 15 లక్షలు సంపాదించాడని బంధుమిత్రుల నెందరినో ఆదరించాడు.



విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవివి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి అభినందనలు తెలుపుతున్న తెలుగుదేశం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

## అనంతగిరి దండకారణ్య ఉద్యోగ సమితి అవగాహన సదస్సు



అనంతగిరి : మండల లో గల చిలకలగెడ్డ పంచాయతీ చిలకలగెడ్డ గ్రామం నందు ఈరోజు శుక్రవారం దండకారణ్య ఉద్యోగి సమితి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమమునకు డి ఎల్ ఓ డీఈవో డి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దండకారణ్య ఉద్యోగ సమితి, వ్యవస్థాపక అధ్యక్షులు చెండా ఎలియా ముఖ్య అతిథిగా హాజరై దండకారణ్య ఉద్యోగ సమితి విధివిధానాలు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో లో ఈ క్రింది విషయాలను చర్చించడం జరిగింది, 1, మినీ గురుకులం టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ కొరకు పని చేయుట కొరకు 2, ప్రభుత్వ జూనియర్ కళాశాల కు పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేయడం 3, అనంతగిరి విద్యార్థులకు కళాశాల స్కాలర్షిప్ మంజూరు కొరకు 4, వ్యాలీలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం టి టి సి సెంటర్ పునరుద్ధరణకు కృషి చేయడం 5 , భారత దేశ ఆదివాసులకు స్వయంపాలన అనే అంశం మీద చండా ఎలియా మాట్లాడడం జరిగింది, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మెల్ల కిరాజబాబు కార్యదర్శి. సెర్రికి సింహాచలం, సోభ రవి, శడుంబరి సన్యాసిరావు,. కోశాధికారి, తడబరికి సుబ్బారావు, యల్, బి,మంజునాథ్, సుమన్ బాబు, పెనుమాల, కంబ భానుమూర్తి, కోడా మత్య లింగం పాల్గొన్నారు.

## కృష్ణదేవపేట బయలుదేరిన అప్పన్న ప్రచార రథం



సింహాచలం : శ్రీ సింహాద్రినాధుని అప్పన్న ప్రచార రథం హిందూ ధర్మ రక్ష పరిషత్ లో భాగంగా శుక్రవారం నాడు గొలుగొండ మండలం కృష్ణదేవ పేట బయలుదేరి వెళ్ళగా రథానికి ఆలయ ఏఈఓ పులి రాంబాబు కొబ్బరికాయ కొట్టి ప్రచార రథాన్ని ప్రారంభించారు. రథం వెంట అర్చకస్వాములు బయలుదేరి వెళ్ళగా సాయంత్రం స్వామివారికి కళ్యాణం ఘనంగా నిర్వహించ నున్నారు.

## అంభేరుపురంలో శంకాలమ్మను దర్శించుకున్న అనకాపల్లి ఎం.పి. సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు



చోడవరం-మండలంలోని అంభేరుపురం గ్రామంలో జరిగిన శంకాలమ్మ పండుగ మహోత్సవం సందర్భంగా అనకాపల్లి ఎం.పి, భీశెట్టి సత్యవతి,విష్ణుమూర్తి దంపతులు గురువారం రాత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి ఎం.పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులతో గెలిపించారన్నారు. ఈ సందర్భంగా తాము నెలకొల్పిన వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో యువతకు అవసరమైన జిమ్, క్రీడా స్థలం అభివృద్ధి, సి.సి.రోడ్లు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.దొడ్డివారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వై.సి.పి మండల కార్యదర్శి సూరిశెట్టి గోవింద, శరగడం నాగేశ్వరరావు, దాడి ఆదిబాబు, పీలా అబ్బాయి,ఆడారి కోటి,మజ్జి నాగేశ్వరరావు, సూరిశెట్టి ముత్యాల నాయుడు, దొడ్డి కాశీ,సూరిబాబు, ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చోడవరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



చోడవరం: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీవారిచే విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు.సాయంత్రం ఉట్ల సంబరం, స్వామి వారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి సుదర్శన సీతారామా భార్యులచే శ్రీ కృష్ణ వైభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి గణేష్, చలపతిరావు, శ్రీ వేణుగోపాలస్వామి యాదవ సంఘం,నౌడువీధి, బోళ్ళ వీధి నాయకులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బొడ్డాన చిన అప్పారావు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పినబోయిన అప్పారావు యాదవ్, పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ మారిశెట్టి విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు. చోడవరం ద్వారకానగర్‌లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలలో షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు,స్థానిక యువత పాల్గొన్నారు. స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం వద్ద గల శ్రీ కృష్ణ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని గజపతినగరం గ్రామంలో పాల సంఘం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట సూరిబాబు, కోరుకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో తాజా మాజీ జెడ్.పి.టీ.సి.సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు పాల్గొని విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ నాయకులు శరగడం రామునాయుడు, మాజీ సర్పంచ్‌లు కనిశెట్టి రామునాయుడు, మళ్ళ శ్రీనివాసరావు, కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ శరగడం జగ్గారావు, బుద్ద రామకృష్ణ, పాల సంఘం బోర్డు డైరెక్టర్లు , గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గంధవరం, వెంకన్నపాలెం, గౌరీపట్నం గ్రామాలలో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉట్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు.

## పినకోటలో, సిపిఎం జెండా ఆవిష్కరణ



అనంతగిరి : మండలములోగల మారు మూల పంచాయతీ పినకోట పంచాయతీ కొర్రపర్తి గ్రామంలో సీపీఎం పార్టీ జెండా అవిస్కరణ జరిగింది. అనంతరం పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దీసారి గంగరాజు దాసరి ఎంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదో చేస్తారని ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూసి మోస పోయారు ఉన్న పథకాలు రద్దు చేస్తూ, రద్దుల ప్రభుత్వం గా మారిందని ఎద్దేవాచేశారు గ్రామ వాలంటిర్ ఉద్యోగాలు డబ్బులు ఇచ్చిన వారికె నియమించారని ఆరోపించారు. కొర్రపర్తి గ్రామంలో 12లక్షల రూపాయల తో నిర్మించిన మంచినీటి పథకం పూర్తి చేయకుండానే బిల్లులు మార్చరని వారు అన్నారు. వెంటనే కొరపర్తి గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు .ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు మోస్య కొండలరావు దేవయ్య సీతయ్య దేముడు ఎర్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు,

## గంధవరంలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చోడవరం-కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని గంధవరం గ్రామంలోని యువకులు శుక్రవారం రక్తదాన శిభిరం నిర్వహించారు. విశాఖపట్నం ఎన్.టి.ఆర్ బ్లడ్ బ్యాంకు వారిచే నిర్వహించిన ఈ శిభిరంలో సుమారు 30 మంది యువకులు పాల్గొని స్వచ్ఛంధ రక్తదానం చేశారు. స్థానిక నాయకులు, శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి జ్యోతి వెబ్ సైట్ ప్రారంభం



శ్రీకాకుళం : జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు రూపొందించిన ఉపాధి జ్యోతి వెబ్ సైట్ శుక్రవారం ప్రారంభం అయింది. బాపూజి కళామందిర్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ వెబ్ సైట్ ను ప్రారంభించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి జ్యోతి వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. ఉపాధి కోసం ఎదురు చూస్తున్న యువతను, వివిధ పారిశ్రామిక సంస్థలు, వ్యాపార, ఉద్యోగ కల్పన కార్యాలయాలు, సంస్థలతో అనుసంధానించడం ఈ వెబ్ సైట్ ముఖ్య ఉద్దేశ్యం. జిల్లాలో యువత తమ అర్హతలను వెబ్ సైట్ లో నమోదు చేసుకోవడం ద్వారా వైబ్ సైట్ లో అనుసంధానమైన సంస్థలు తమకు అవసరమైన విద్యార్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులను వైబ్ సైట్ ద్వారా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. జిల్లా యువతకు ఇది ఒక చక్కని అనుసంధాన వేదికగాను, ఉపాధి మార్గానికి చక్కని బాటగాను ఉంటుంది. యువత తమ అర్హతలకు ఏ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో పరిశీలించుకనే అవకాశం వెబ్ సైట్ లో ఉండగా, వైబ్ సైట్ లో నమోదైన సంస్థలు తమకు సరిపడే విద్యార్హత, అనుభవం కలిగిన యువతను ఎంపిక చేసుకునే అవకాశం సైతం ఉంది. ఇటు యువతకు, అటు సంస్థలకు వారధిగా ఉపాధి జ్యోతి వెబ్ సైట్ పనిచేస్తుంది. జిల్లా యువతకు చక్కని వేదికగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ నిరుద్యోగం ప్రభలుతున్నరోజుల్లో ఉపాధి జ్యోతి వెబ్ సైట్ యువతకు మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. నిత్య జీవితంలో నిజాయితీగా బ్రతుకుతెరువుకోసం చేసుకునేది ఉద్యోగమన్నారు. ఆదాయం ఉండటం వలన గౌరవంగా జీవించుటకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగానికి అవసరమగు మంచి శిక్షణ పొందాలని పేర్కొన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసే కర్మాగారాలు, పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందని అన్నారు. అందుకు అనుగుణంగా యువత చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తద్వారా ఉద్యోగాలు పొందవచ్చుని చెప్పారు. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు పొందుటకు కృషి చేయాలని, తప్పుడు దారిలో వెళ్లుటకు ప్రయత్నించరాదని యువతకు పిలుపునిచ్చారు. మంచి శిక్షణ పొందాలని మెలుకువలు నేర్చుకోవాలని కోరారు. ప్రస్తుతం భర్తీ చేస్తున్న గ్రామ సచివాలయ పోస్టులు పూర్తిగా ప్రతిభ ఆధారంగా నింపడం జరుగుతుందని స్పష్టం చేసారు. నిజాయితీగా పరీక్షను రాయాలని, మంచి మార్కులను సంపాదించిన వారే పోస్టులను పొందుతారని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టారని చెప్పారు. యువతకు శ్రద్ధ, ఆసక్తి ఉండాలని తద్వారా జీవితాశయం సిద్ధిస్తుందని అన్నారు. జిల్లాలో లక్ష ఉద్యోగాలను కల్పించుటకు జిల్లా యంత్రాంగం ప్రయత్నించడం శుభసూచకమని మంత్రి అన్నారు. ఇటువంటి అవకాశాలను యువత వినియోగించుకోవాలని కోరారు.

శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు మాట్లాడుతూ ఉపాధి జ్యోతి వెబ్ సైట్ చక్కటి ప్రయత్నం అన్నారు. వెబ్ సైట్ ద్వారా పెద్ద ప్రయోజనం ఉందని పేర్కొన్నారు. ప్రతి పనిలో నైపుణ్యం అవసరమని దానిని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం యువతలో నైపుణ్య అభివృద్ధికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. చిన్న ఉద్యోగమనే ఆలోచనతో ఆగిపోవద్దని పిలుపునిస్తూ చిన్న ఉద్యోగాలలో చేరినవారు గొప్ప విజయాలు సాధిస్తారని అనేక మంది రుజువు చేసారని తెలిపారు. గ్రామ సచివాలయాల ఉద్యోగాల భర్తీకి అనేక మంది సిఫారసులకు వస్తున్నారని, అటువంటి సిఫారసులు చెల్లవని, పూర్తిగా ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ జిల్లా నుండి ఎక్కువ మంది వలసలు వెలుతున్నారని, వలసల నివారణకు అర్హమైన వారికి ఉపాధి కల్పించుటకు ఉపాధి జ్యోతి వెబ్ సైట్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో యువత వివరాలు అందుబాటులో ఉంటే ఉపాధికల్పనకు అవకాశం కలుగుతుందనే ఉద్ధేశ్యంతో వెబ్ సైట్ ను ఆవిష్కరించామన్నారు. యువతకు, ఉపాధి కల్పన సంస్థలకు వారధిగా వెబ్ సైట్ పనిచేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెల ఒక జాబ్ మేళాను నిర్వహించాలని సంకల్పించామని, తద్వారా లక్ష మంది యువతకు ఉపాధి కల్పించాలనే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ఉద్యోగ మేళాలో నిర్వహించే ఉద్యోగాలకు సరిపడే విధంగా నైపుణ్యాలు అభివృద్ధి పరచుకోవాలని కోరారు. ఏ ఒక్క వ్యక్తి కూడా ఖాళీగా ఉండరాదనే అభిమతంతో ఉన్నామని పేర్కొంటూ దూరం దగ్గర అనే తేడా లేకుండా ఉపాధి కలిగిన ప్రదేశానికి వెళ్ళుటకు యువత సిద్ధంగా ఉండాలని కోరారు. ఉపాధి జ్యోతి వెప్ సైట్ సాఫ్ట్ వేర్ ను మీ సేవా కేంద్రాలలో పెట్టడం జరిగిందని, అచ్చట రూ.25 చెల్లించి యువత నమోదు కావచ్చని తెలిపారు. వెబ్ సైట్ ద్వారానే జాబ్ మేళాకు హాజరు కావచ్చని, ప్లేస్ మెంటు ఆర్డర్ కూడా వెబ్ సైట్ ద్వారానే లభిస్తుందని అన్నారు. అభ్యర్థి ఫోన్ నంబరుకు మెసేజ్ వస్తుందని ఆయన చెప్పారు. డి.ఆర్.డి.ఏ ద్వారా అందించిన నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పొంది ఖజానా జ్యూయలరీల సహాయ మేనేజర్ గా పనిచేస్తున్న కింతలికి చెందిన ఆర్.దాలిబాబు, రిటైల్ రంగంలో పనిచేస్తున్న పావని శిక్షణా కార్యక్రమం వలన కలిగిన ప్రయోజనాలను వివరించారు. శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉందని తద్వారా ఉపాధి పొందామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఏ.భార్గవ తేజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ ఏ.కళ్యాణ చక్రవర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.రమణ, బి.సి కార్పొరేషన కార్యనిర్వాహక సంచాలకులు జి.రాజారావు, ఎస్.సికార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు సి.హెచ్.మహాలక్ష్మి, సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి వి.వి.ఆర్.ఎస్.మూర్తి, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఎం.కిరణ్ కుమార్, నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ డా.గోవింద రావు, మాజీ పురపాలక ఛైర్మన్ అంధవరపు వరం., చిరంజీవి నాగ్, కోణార్క్ శ్రీనివాసరావు, మామిడి శ్రీకాంత్, మండ రవి, మహిబుల్లా ఖాన్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అక్షర స్కూల్‌లో
# కృష్ణాష్టమి వేడుకలు



కంచరపాలెం: జీవీఎంసీ 39 వ వార్డు పరిది మాధవధార వద్ద నున్న శ్రీ అక్షర స్కూల్ లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు ఉట్టి కొట్టారు. చిన్నారులు కృష్టునుడు , గోపిక, రుక్మిణి, సత్యభామ వేషధారణలో అలరించారు. కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ మందాకిని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గున్నారు.

మాట తప్పని మనిషి
# ఎమ్మెల్యే అదీప్ రాజ్



పరవాడ: స్దానిక శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రజా భరోసా పాదయాత్రలో పరవాడ మండలం రావాడ గ్రామపంచాయతీ శివారు మోటూరువానిపాలెం గ్రామము లో రామాలయం నిర్మాణం కొరకు 1,00,000/-(లక్ష) రూపాయలు విరాళంగా ఇస్తారనీమాట ఇచ్చారు. అన్నవిదంగా శుక్రవారము రావాడ గ్రామపంచాయతీ ముఖ్య నాయుకులుసమక్షంలో అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సి.ఇ.సి.సభ్యులు పైల శ్రీనివాసరావు , సిరిపురపు అప్పలనాయుడు, చుక్క రామునాయుడు, మాజీ ఉప సర్పంచ్ కోన రామారావు , కావలి వాసు,గోవింద్,అశోక్, నాని,హేమచంద్ర తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రొయ్యల ఫ్యాక్టరీని సందర్శించిన
# మానవ హక్కుల మిషన్ సభ్యులు



అన్నవరం: తూ.గో.జిల్లాతొండంగి మండలం లోని బెండపూడి గ్రామ రెవిన్యూ లో గల రాయిల్ రొయ్యల పాక్టరీని మానవ హక్కుల మిషన్,తూర్పు గోదావరి జిల్లా లీగల్ కార్యదర్శి,న్యాయవాది, పెద్దాపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పిల్లి.బలరాముడు,మిషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇండుగపల్లి. నూకరాజు,పలివెల. నాగేంద్రరాజు(న్యాయవాది),పెద్దింటి.లక్ష్మణ్ కుమార్,గంపల.రాజు సంయుక్తంగా సందర్శించి ప్యాక్టరీలో పని చేసే కార్మికుల వివరాలు,వారికి అమలు జరిపే సంక్షేమ,అభివృద్ధి,వేతన,పని గంటలు,వీరి కుటుంబాల వారికి అందించేందుకు చర్యలు,రక్షణ చర్యలు,అలాగే వీరికి కేటాయించిన ఉద్యోగం వివరాలు,ఉద్యగ భద్రత,సమస్యలు పరిష్కార విధానాలు, నియామకాలు విధానాం,అదనపు పనిదినాలుకి అదనపు వేతనం వివరాలు,గోప్యంగా ఉంచే కార్మికులు వివరాలు,మహిళా పనివారు రక్షణ వివరాలు,వీరి సంక్షేమం,వేతనాలు గురించి, అలాగే పాక్టరీ స్థాపన అనుమతులు,ప్రభుత్వ అధికారులు లోపాలు మీద చర్యలు తీసికొనేందుకు సందర్శన వివరాలు,పాక్టరీ నిర్మాణం కొరకు భూసేకరణ లో రైతులకు ఇచ్చిన హామీలను,పంచాయతీ రాజ్ అనుమతులు, అభివృద్ధి కొరకు నిధులు ఇస్తామని చెప్పిన మాటలు,వాటి అమలుకు నేటికి చేపట్టిన చర్యలు,విడుదల చేసిన నిధులు ఖర్చు,వీటి మీద పంచాయతీ బాధ్యత ఎవరిది అనే విషయాన్ని రైతు కుటుంబాలను పునర్ ఉపాధి వివరాలు మొత్తం చట్టాల పరిధిలోకి రానున్న అన్ని విషయాలను క్షేత్రాన్ని ఆరాతో ఈ టీమ్ సందర్శించారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు.ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజ,పుణ్య వచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలు కోంపెల్ల.మూర్తి,కుచిబోట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు,అర్చకులు

నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసి రమేష్ బాబు,ఏఈవో ఎమ్.కె.టి.వి.కె.ప్రసాద్, సూపరింటెండెంట్ అనకాపల్లి.ప్రసాద్,ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ద,ప్రసాదాలు అందజేసారు.

## కృష్ణాష్టమిని పురస్కరించుకుని రత్నగిపై ఘనంగా గో పూజోత్సవం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ స్వామివారి ఆలయ ప్రాంగణంలో రామాలయం ఎదురుగా గల కళా మందిరం వద్ద శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోపూజ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రత్నగిరిపై గల రామాలయం ఎదురుగా గల ఆవరణలో శ్రీ కృష్ణ భగవానునికి ఎంతో ప్రీతికరమైన గోవులను పుష్పాలతో అలంకరించి సామూహిక గో పూజలు నిర్వహించారు.దేవస్థానం వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో గోవులకు దేవస్థానం ఏసి రమేష్ బాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.శ్రీ వీరవేంకట సత్యనారాయణస్వామివారి ప్రధానాలయంలో శ్రీ కృష్ణాష్టమి ని పురస్కరించుకుని సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు.కృష్ణాష్టమి వేడుకలో ప్రధాన ఘట్టమైన ఉట్టుకొట్టే ఉత్సవాన్ని రత్నగిరిపై గల రామాలయం,కొండ దిగువున ఉన్న తొలి పావంచాల వద్ద నిర్వహించారు.ఈ ఉత్సవంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీ సత్యదేవున్ని సుందరంగా అలంకరించిన వెండి పల్లకీలో ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు.

## శ్రీ లక్ష్మి నారాయణ మహిళ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



కంచరపాలెం: జీవీఎంసీ 41 వ వార్డు పరిది సుబాష్ నగర్ వద్ద శ్రీ లక్ష్మి నారాయణ మహిళ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన పచ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో బాగంగా లక్ష్మి నరసింహ కోలాట బృందం ఆధ్వర్యంలో నివహించిన కోలాటం పలువురిని ఆకర్శించాయి. చిన్నారులు శ్రీ కృష్ణుడు , సత్యభామ , రుక్మిణీ వేషధారణతో ఆలరించారు.

కార్యక్రమంలో టీడీపీ వార్డు అద్యక్షుడు పెంటకోట త్రినాధ్ రావు , కుట్టా కార్తీక్ , అజయ్ బాబు , కోలాట బృందం సభ్యులు వి.పద్మావతి , బీశెట్టి భవానీ , వి.సౌజన్య , ఎం .జోతికా , ఎస్ .మను పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గున్నారు.

## 108 పట్టు చీరలతో అష్ట లక్ష్మీ దేవి అలంకరణ



మధురవాడ, మధురవాడ పరిసర ప్రాంతాలలో గల అమ్మవారి దేవాలయాలు నాలుగోవ శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. నాలుగో వార్డు పరిధి కొమ్మాది అష్టలక్ష్మి ఆలయం లో చామర్తి శ్రీధర్ స్వామీజీ ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో ప్రారంభించి, అష్టలక్ష్మి హోమం, కుంకుమార్చనలు అనంతరం శ్రీ లక్ష్మి నారాయణ లకు విశేషంగా 108 పట్టుచీరల తో అంగరంగ వైభవంగా పూజ అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు, కృష్ణాష్టమి సందర్భంగా శనివారం శ్రీవైష్ణ జయంతి వేడుకలు జరుగుననని ఆలయ అర్చకులు తెలిపారు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అన్నం రాజు సత్యనారాయణ మూర్తి, రమాదేవి దంపతులు పాల్గొన్నారు అలాగే చంద్రంపాలెం జాతర గట్టుపై ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం నుండి అమ్మవారి ఆలయంలో యధావిధిగా గొత్ర నామలాతో పూజా కార్యకమాలు, ఉదయం 10 గంటలకు ప్రత్యేకంగా శ్రావణ లక్ష్మికి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్ కు పంచామృత ఆభిషేకములు, సహస్ర ధార జల అభిషేకం జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని అమ్మవారి దర్శించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా కృష్ణంనాయుడు ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షలు పివిజి అప్పారావు, యస్. రాంబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిళ్లా రామారావు, పిళ్లా శ్రీనువాసరావు, పిళ్లా వెంకటరమణ, కేశనకుర్తి అప్పారావు, దుక్క వరం, జగుపిల్లి నాని, పోతిన అచ్చియ్యపాత్రుడు, పీస రామారావు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు ఆలయ అర్చకులు పట్నాల ప్రసాద్ శర్మ, మూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు

## అత్యంత వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్ఠమి ఉత్సవాలు ప్రారంభం



విశాఖపట్నం: జగద్గురువు శ్రీల ప్రభుపాదుల వారు స్థాపించిన అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంస్థ సాగర్ నగర్ ఇస్కాన్ ప్రాంగణంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు మంగళధ్వని, వేదమంత్రోచ్ఛరణ, శ్రీహరే కృష్ణ మహామంత్ర సంకీర్తనార్చనలతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పర్యాటక శాఖామాత్యులు అవంతి శ్రీనివాస్ హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ శ్రీ కృష్ణ పరమాత్ముని అవతార విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొని శ్రీ కృష్ణ భాగవానుని కృపను పొందాలన్నారు. సాగర్‌నగర్ ఇస్కాన్ చేపడుతున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన విఎంఆర్‌డిఎ ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగివుండాలన్నారు. శ్రీ కృష్ణ పరమాత్ముని ప్రేమ అవ్యాజమైనదిగా పేర్కొన్నారు. ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్ ఇస్కాన్ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యకలాపాలను తెలిపారు. చందన డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాంశములు శ్రీ కృష్ణలీలలపై ఉపన్యాసం, కృష్ణదామోదరం నృత్యరూపకం అందరినీ విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన గీతా పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా లక్ష రూపాయలు ద్వితీయ బహుమతిగా యాభైవేలు, తృతీయ బహుమతిగా పాతికవేలు, కన్సొలషన్ బహుమతిగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున వందమందికి అందజేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్, మాతాజీ నితాయి సేవిని, ఇస్కాన్ పిఆర్‌ఓ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ అర్చకులు, జీవితకాల సభ్యులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలి

## పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్

## ఘనంగా మండల కేంద్రంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు



సబ్బవరం: ప్రతీ ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్ పేర్కొన్నారు.మండల కేంద్రంలో ఉన్న స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుండి శ్రీ కృష్ణ ఆలయంలో ఘనంగా పూజలు జరిగాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు తెల్లవారుజాము నుండి క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో శ్రీకృష్ణునికి పూజలు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్ మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఉదయం స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. భక్తిభావం ఉన్నప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని అప్పుడే పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రసాద వితరణ ఘనంగా జరిగింది. సాయంత్రం ఆలయ కమిటీ వారిచే ఉట్లె సంబరం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ వేషధారణ పోటీలు జరిగాయి. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్ బేబి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తుంపాల అప్పారావు, సబ్బవరపు ముత్యాలనాయుడు, వనం అచ్చెంనాయుడు, మండల సముద్రం, ధనిమిరెడ్డి శ్రీనువాసరావు, వడ్డాది అప్పలరాజు, కాపుశెట్టి శేషు, కర్రి బాబు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేరు నీరు చెరువులకు అందేలా ఎమ్మెల్యే ఆదేశాలు

రావికమతం: మండలంలో పలు గ్రామాల్లోని చెరువులకు పెద్దేరు నీరందేలా ఏర్పాట్లు చేయాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కాలువల్లో పూడిక తీసుకొని సిద్దంగా ఉంచాలని చెప్పడంతో రావికమతం, గుమ్మాళ్లపాడు రైతులు పెద్దేరు కాలువ పూడికతీతకు స్వచ్చంధంగా కదిలారు. జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురిసినప్పటికీ రావికమతం మండలంలో కురవలేదు. దీంతో చెరువుల్లో నీరు లేక వరినాట్లు పడలేదు. ఈ విషయాన్ని మండల వైసిపి నాయకులు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దేరు నీరు గుమ్మాళ్లపాడు అప్పలరాజు చెరువుకు, రావికమతం పెద్దిరాజు చెరువుకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరడంతో ఆయన ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

## సమస్యలుంటే నేరుగా కలవండి: చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



రోలుగుంట: సమస్యలుంటే నేరుగా తనను కలవాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం రోలుగుంట మండలం కంచుగుమ్మల గ్రామంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజలందరికీ అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఏం అవసరం ఉన్నా, ఏ పని ఉన్న, ఏ సమస్య ఉన్నా వెంటనే నేరుగా తననుకలవవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు భాస్కర్‌రావు బాబు, శ్రీనివాస్, రాజారావు, వివిధ గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అన్ని విధాల

# ప్రభుత్వ సహాయం ఉంటుంది

### రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖ సిటీ: రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రథం మరియు ప్రియమ్ స్కాట్టింగ్ నేషనల్ ఛాంపియన్స్ మంత్రి సీతమ్మధారలో తన ఇంటివద్ద కలిశారు.

ఇప్పటివరకు ప్రథం స్కేటింగ్‌లో ఆరు అంతర్జాతీయ మెడల్స్, ఇరవై ఏనిమిధి జాతీయ మెడల్స్ సాధించాడు మరియు ప్రియమ్ రెండు అంతర్జాతీయ మెడల్స్, 30 జాతీయ మెడల్స్ కలిగి ఉన్నారని క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో ఎవరైతే క్రీడాకారులు ఉన్నారో వాళ్ళకి మంత్రి అవంతి శ్రీనివాస రావు భవిష్యత్తులో స్పోర్ట్స్‌కు సంబంధించి వారికీ అన్ని విధాల ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలియచేసారు.

అదే విధంగా అంతర్జాతీయ క్రీడాకారులు ప్రథం మరియు ప్రియమ్‌ను మంత్రి ఘనంగా సత్కరించారు.

# ప్రోటోకాల్ వివాదం

### తెదేపా, వైకాపా తోపులాటల మధ్యే ప్రారంభోత్సవం

విశాఖ: హుద్‌హుద్ తుపాను బాధితుల కోసం విశాఖ తూర్పు నియోజకవర్గంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-7లో నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. ఇళ్ల ప్రారంభానికి మంత్రి అవంతి శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు సహా వైకాపా నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తెదేపాకు చెందిన స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఆహ్వానం లేకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో తెదేపా, వైకాపా వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తెదేపా కార్యకర్తల ఆందోళన మధ్యే మంత్రి ప్రారంభోత్సవం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న తనకు ఆహ్వానం అందకపోవడంపై వెలగపూడి రామకృష్ణబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్‌ను ఉల్లంఘనపై అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తోపులాట అంశంలో వైకాపా కార్యకర్తలపై కేసు



నమోదు చేయాలని వెలగపూడి డిమాండ్ చేశారు.

# సీఎం సహాయనిధితోనే పేదలకు అండదండ

### కేన్సర్ వ్యాధిగ్రస్తుని కుటుంబ సభ్యులకు సహాయనిధి చెక్‌ను అందజేస్తున్న కేకే రాజు



విశాఖపట్నం : విశాఖ ఉత్తర నియోజకవర్గం 11 వార్డుకు చెందిన పడాల సునీత క్యాన్సర్ వ్యాధితో కొన్ని నెలలుగా బాధపడుతున్నారు.. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులు విశాఖ ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త కెకె రాజుకు తెలియజేయగా తక్షణమే కేకే రాజు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులతో మాట్లాడి సీఎం సహాయనిధి నుంచి 1,50,000 రూపాయలు మంజూరుకు కృషి చేసారు. ఈ చెక్‌ను శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు కెకె రాజు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ కు, కెకె రాజు కు బాధిత కుటంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా కెకె రాజు మాట్లా డుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేనటువంటి వ్యాధులతో ఎవరైనా బాధపడితే కచ్చితంగా సీఎం సహాయనిధి నుండి ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు విశ్వనాధరాజు, సుశీల, నంబాల రాజేష్, శివ పాల్గొన్నారు.

# అన్యమత ప్రచారం తగదు

- ప్రభుత్వమే నిగ్గు తేల్చాలి
- హిందువుల మనోభావాలు దెబ్బతీసే అవకాశం ఉంది
- విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



ఋషికేశ్: రుషీకేష్‌లోగల విశాఖ శ్రీ శారదా పీఠం శాఖా భవనంలో చాతుర్మాసదీక్ష చేస్తున్న షణ్మతస్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య సాంప్రదాయ విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు శుక్రవారం మీడియా ద్వారా తిరుపతి బస్సు స్టాండులో బస్సు టికెట్ వెనుకవైపు అన్యమతం యొక్క ముద్రలను ముద్రించి అన్యమత ప్రచారం జరుగుతున్నట్లుగా తెలిసినది అన్నారు.

ఇది చాలా దుర్మార్గమైన చర్య ఎవరు ఇలాంటి కుట్రలకు పాలుపడుతున్నారో, ఈ కుట్ర వెనుక ఏ వ్యక్తులు దాగి ఉన్నారో, ఎవరి ప్రోద్భలముతో ఇలాంటివి చేస్తున్నారో నిగ్గు తేల్చాల్సిన అవసరము ప్రభుత్వానికి ఉంది. ప్రభుత్వం సరియైనటువంటి దిశగా పయనించి నిగ్గు తేల్చి దోషులను కఠినంగా శిక్షించాలి. దీనిమీద స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణ చేసి, కఠిన చర్యలు తీసుకునే విధంగా స్పందించాలి. ఎందుకంటే తిరుమల తిరుపతి దేవస్థానము గూర్చి గాని, తిరుమల తిరుపతి దేవస్థానము యొక్క విశిష్టత ప్రపంచ వ్యాప్తంగా తెలిసియున్నది. అక్కడే ఇటువంటివి జరిగితే హిందువుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉన్నది. కాబట్టి హిందువుల యొక్క మనోభావాలు దెబ్బతినకుండా, ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో ఉన్న దివంగత రాజశేఖరరెడ్డి హిందూ దేవాలయాల చుట్టూ అన్యమత ప్రచారం చేయకూడదని ఉత్తర్వులు జారీ చేసియున్నారు. వీటన్నింటినీ సమీక్షించి ముఖ్యమంత్రి వెనువెంటనే స్పందించి, చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నాము. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్ళటం జరిగినది. ఈ చర్యలను ఋషికేశ్‌లో చాతుర్మాస దీక్షలో ఉన్న విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు తీవ్రంగా ఖండించడం జరుగుతున్నదని విశాఖ శారదాపీఠ ధర్మాధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కృష్ణమాయలోనే పరమార్థం దాగిఉంది

- రాళ్ల బెల్లా ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణ - గోపికల వేషధారణలో ఆహూతులను అలరించిన చిన్నారులు
- నృత్య రూపకంలో కృష్ణ తత్వాన్ని బోధించిన విద్యార్థులు






గోపిక వేషధారణలో పలువురి ప్రశంసలను అందుకున్న ప్రముఖ వ్యాపారవేత్త, సంఘసేవకుడు రాకేష్ మహదేవ్ కుమార్తె రిచిత మహదేవ్

విశాఖ సిటీః ద్వాపర యుగంలోని కృష్ణావతారంలో పరమాత్మ చిన్నతనం నుండి చివరి వరకు వివిధ అంశాలలో ప్రబోధించిన తత్వాలలోనే కృష్ణ పరమార్థం దాగిఉంది. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ రాళ్ల బెల్లా విద్యార్థుల కృష్ణ గోపిక ప్రదర్శనలు పలువురు ఆహూతులను ఆకర్షించాయి. ఇందులో భాగంగా చిన్నారులు వివిధ వేషధారణలో నృత్యరూపకం ప్రదర్శించి కృష్ణతత్వాన్ని తెలియజేశారు.

### నాడాపై భారత ఒలింపిక్ సంఘం విమర్శలు

దిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధ సంస్థ (నాడా)పై భారత ఒలింపిక్ సంఘం తీవ్ర విమర్శలు చేసింది. మీరు చేసిన పొరపాటుకు ఇతరులు డబ్బులు ఎందుకు చెల్లించాలని ఘాటుగా ప్రశ్నించింది. రూపాయలతో పోయే దాన్ని డాలర్లకు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది. జాతీయ డోప్ పరీక్ష ప్రయోగశాల గుర్తింపును ప్రపంచ డోపింగ్ నిరోధ సంఘం ఆర్నెల్ల వరకు రద్దు చేసిన సంగతి తెలిసిందే.



ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్ఆర్ సీపీ యువ నాయకుడు కర్రి కృష్ణరాజు జన్మదినోత్సవ వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా నగర వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మరియు అభిమానులు, పలు పార్టీల నాయకులు హాజరై కృష్ణరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



జివిఎంసి యుసీడీ పీడీ యాదగిరి శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందిస్తున్న 24వ వార్డు వైఎస్ఆర్ పార్టీ జోన్ 3 టిఎల్ఎఫ్ఐ మహిళ అధ్యక్షురాలు బెహరా వెంకటరత్నం

## ఏపీఈపిడిసిఎల్‌లో ఆంధ్రకేసరి 148వ జయంతి వేడుకలు



విశాఖపట్నం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ అన్నారు. గురుద్వార దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు 148వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి సంస్థ సి.ఎం.డి నాగలక్ష్మి సెల్వరాజన్, డైరెక్టర్ ఆపరేషన్స్ కె.రాజబాపయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సీ.ఎం.డి నాగలక్ష్మి సెల్వరాజన్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరంలో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో తుపాకీకి ఎదురు నిలిచి తనను కాల్చమని సవాలు చేయడంతో ఆంధ్రకేసరిగ పేరు గాంచారన్నారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ఎంతో కీలకంగా వ్యవహరించి 1953లో కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన మహనీయుని జయంతి వేడుకలను జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆ మహనీయుని జీవితాన్ని మనమంతా ఆదర్శంగా తీసుకుని వినియోగదారులకు విశేష సేవలందిస్తూ తద్వారా సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ కె.రాజబాపయ్య మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశంపంతులు గారి పోరాటపటిమను, నిజాయితీని, సమాజం పట్ల వారికి వున్న అంకిత భావాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు పి.నాగేశ్వరరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, ఆర్. శ్రీనివాసరావు, పి.ఎస్.కుమార్, జి.శ్రీనివాసరెడ్డి, జి.శరత్ కుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ĸ Phone : 2564353, Fax : 0891-2569004 ĸ e-mail: vijayabhanudaily@gmail.com